




ఎన్నికల కేంద్రంలో కౌన్సిలర్లతో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య



# భూ మాయ!

బెజవాడలో భూ మాఫియా రెచ్చిపోతోంది. విజయవాడ వెస్ట్ బైపాస్ కేంద్రంగా కొందరు ప్రైవేటు వ్యక్తులు భూ దందాలకు పాల్పడుతున్నారు. సీలింగ్, అసైన్డ్, పోరంబోకు, కాలువ భూములు ఇలా ఏది కనిపిస్తే దాన్ని కబ్జా చేస్తున్నారు. పాత తేదీలతో డాక్యుమెంట్లు పుట్టించి లేఅవుట్లు వేస్తున్నారు. ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి భారీన పడి అనేక మంది పేద, మధ్య తరగతి ప్రజలు మోసపోతున్నారు.

## విజయవాడ వెస్ట్ బైపాస్ కేంద్రంగా మాఫియా దందాలు!

### సీలింగ్, అసైన్డ్, పోరంబోకు, కాలువ భూములే లక్ష్యంగా ఆక్రమణ

- పాత తేదీలతో డాక్యుమెంట్లు పుట్టించి లే అవుట్లు వేసి ప్లాట్లుగా విక్రయాలు
- సర్వే నంబర్లు మార్చి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు
- మోసపోతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ అలైన్‌మెంట్ బహిర్గతమైనప్పటి నుంచి కొంత మంది ప్రైవేటు వ్యక్తులు భూ దందాలకు తెరతీశారు. విజయవాడ వెస్ట్ బైపాస్ పరిధిలోకి గన్నవరం, విజయవాడ రూరల్, మైలవరం మండలాలు వస్తాయి. ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులను పట్టుకుని ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, చాలా కాలంగా ఎవరూ పట్టించుకోకుండా వదిలేసిన పోరంబోకు భూములు, పూడుకుపోయిన చెరువుల వివరాలను రహస్యంగా సంపాదించి పూర్వకాలంలో ఎవరివో భూములుగా డాక్యుమెంట్లు పుట్టిస్తున్నారు. ఈ డాక్యుమెంట్లను కూడా గొలుసు కట్టు స్పెషలిస్టులతో రాయిస్తున్నారు. అచ్చుగుద్దినట్టుగా పూర్వం డాక్యుమెంట్ల వలే సృష్టిస్తున్నారు. ఈ డాక్యుమెంట్లలో ఉన్న పేర్ల ప్రకారం ఆ తర్వాత వీలునామాలు రాయించడం, ఆ వీలునామాల ప్రకారం ఆస్తులుగా దాఖలు కావడం, ఆ తర్వాత వేరే వ్యక్తులకు విక్రయాలు చేస్తున్నారు. ఇవి కొన్నాళ్లకు అనేక చేతులు మారుతున్నాయి. ఇందులో గమ్మత్తు ఏమిటంటే.. పూర్వపు డాక్యుమెంట్ నుంచి వీలునామాగా పొందిన వ్యక్తి, ఆ తర్వాత విక్రయం జరిపిన వ్యక్తి వరకు ప్రస్తుతం ఎవరూ జీవించి ఉండరు. ఆ తర్వాత చేతులు మారిన వారు మాత్రమే ఉంటారు.

**లే అవుట్లు వేసి మరీ విక్రయాలు**

భూ మాఫియా ఆక్రమించిన భూమిలో లే అవుట్లు వేస్తోంది. ప్లాట్లుగా విక్రయాలు జరుపుతోంది. రికార్డుల ప్యూరిఫికేషన్, రీ సర్వే, ప్రభుత్వ కార్యక్రమాల కోసం భూముల కేటాయింపు, టిడ్కో ఇళ్లకు స్థలాలు, ఇతర వర్గాలకు ఇళ్ల పట్టాలు కేటాయిస్తున్న మిగతా 8లో..

**కొనుగోలు చేసిన పాపానికి..**

భూములు కొనుగోలు చేసే వారికి ఈ వాస్తవాలు ఏమి తెలియవు. విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి తక్కువ ధరకు భూములు దొరుకుతున్నాయన్న ఏకైక బలహీనత కారణంగా ముందు వెనుక ఆలోచించకుండా భూములు కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది ఇవీ వివాదాస్పద భూములు అని తెలిసినా కూడా తక్కువ ధరకు వచ్చాయి కదా.. అని కొంటున్నారు. కొంత కాలం వరకు ఎవరూ తమను అడగలేదని ధైర్యంగా ఉన్న ఉదంతాలు కూడా ఉన్నాయి. మోసపోయిన వాళ్లలో మధ్య తరగతి వర్గానికి చెందిన వారే ఎక్కువ. భూమి విలువ పెరుగుతుందన్న ఉద్దేశ్యంతో శక్తికి మించి అప్పులు చేసిన వారు కూడా భూములు కొన్నారు. వారి పరిస్థితి చెప్పలేనిది. మరికొందరు సర్వం పోగొట్టుకుంటున్నారు. ఇది తెలిసి తమకు న్యాయం చేయాల్సిందిగా ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే వారు కూడా ఉన్నారు. ఈ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వరించిన పదవి



చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి

## నందిగామ మున్సిపల్ చైర్మన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నిక

నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక ఎట్టకేలకు విజయవంతంగా ముగిసింది. ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సూచించిన వ్యక్తులను పక్కన పెట్టిన అధిష్టానం మధ్యేమార్గంగా మండవ కృష్ణకుమారిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఇరువర్గాల గౌరవం తగ్గకుండా చర్యలు చేపట్టింది. దీంతో మూడు రోజులుగా నందిగామలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఊహించని విధంగా కృష్ణకుమారిని పదవి వరించింది.

- చివరి వరకు పట్టువీడని ప్రభుత్వ విప్ సౌమ్య
- మధ్యేమార్గంగా టీడీపీ అధిష్టానం సూచించిన పేరుకు అంగీకారం
- ముగిసిన నందిగామ మున్సిపల్ 'పంచాయితీ'
- విజయవాడ ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే సౌమ్య మధ్య ఆధిపత్య పోరే దీనికి కారణం!

నందిగామ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా శాఖమూరి స్వర్ణలతను నియమించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సిఫార్సు చేయడంతో వివాదం మొదలైంది. తన నియోజకవర్గానికి చెందిన పదవిని మీరెలా నిర్ణయిస్తారంటూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సౌమ్య అడ్డంతిరిగారు. ప్రతి విషయంలోనూ ఎంపీ తన నియోజకవర్గంలో పెత్తనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి చర్యలు తాను అంగీకరించేది లేదని సౌమ్య స్పష్టం చేశారు. పార్టీ పెద్దలు పలుమార్లు సముదాయించే ప్రయత్నం చేసినా సౌమ్య పట్టువీడలేదు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం నుంచి 4వ తేదీ ఉదయం పది గంటల వరకూ హైడ్రామా కొనసాగుతూనే ఉంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, లోకేశ్ వ్యక్తిగత కార్యదర్శి కిలారు రాజేష్, ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్, మునిసిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ, విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.ఎస్.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, కనపర్తి శ్రీనివాస్ మంతనాలు జరిపినా ఎంపీ సూచించిన వ్యక్తికి పదవి ఇచ్చేది లేదని సౌమ్య భీష్మించారు. కౌన్సిలర్లు కూడా ముక్త కంఠంతో సౌమ్యకు మద్దతు తెలిపారు. వారి సహకారంతో సోమవారం జరగాల్సిన ఎన్నికను వాయిదా వేయించ గలిగారు. ఒక వేళ ఎంపీ సూచించిన వ్యక్తికే చైర్‌పర్సన్ పీఠం ఇవ్వాల్సి వస్తే ఓటింగ్‌కు హాజరు కాకుండా కౌన్సిలర్లను ఆమె మిగతా 8లో..

**ఎందుకింత రచ్చ..**

ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరులో సౌమ్య తన పట్టు నిలుపుకొనేందుకు చివరి వరకూ పోరాడారు. కౌన్సిలర్లతో పాటు పార్టీ నాయకుల మద్దతు కూడగట్టుకొని తన బలం చాటారు. పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు, కీలకమైన మంత్రుల మద్దతతో ఎంపీ పావులు కదిపారు. అధిష్టానం పెద్దలు ఒత్తిడి చేసినా ఆమె ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. కేవలం చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపికే ఈ వివాదానికి కారణం అనుకోవడం పొరపాటు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పలు అంశాలలో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. ఎంపీ తనపై మితిమీరిన పెత్తనం చెలాయిస్తున్నట్లు భావిస్తూ వస్తున్నారు. చివరకు తన అభిమతానికి భిన్నంగా పదవుల కేటాయింపు కూడా జరపడంపై ఆమె ఆగ్రహంతో ఉన్నారు, పార్లమెంట్ సభ్యుడు, ప్రభుత్వ విప్‌ల మధ్య చెలరేగిన వివాదం ఎటుదారి తీస్తుందో అని పార్టీ శ్రేణులు ఆందోళనలో ఉన్నాయి. ఇంత పెద్దయెత్తున సాగుతున్న ఆధిపత్య పోరుపై అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# నేత్రపర్వం.. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



వైభవంగా స్వామివారి రథోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తులు

8లో

**తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.93.40 లక్షలు** 8లో



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

# తీరనున్న కష్టాలు!



కృష్ణా యూనివర్సిటీకి వెళ్లే రహదారి దుస్థితి

## కృష్ణా యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు గుంతలమయం

- గతంలో రూ.10 కోట్లతో డబుల్‌లేన్‌గా వేసేందుకు పిలిచిన టెండర్లు రద్దు
- తాజాగా శివగంగ నుంచి కోనవరకు రోడ్డు అభివృద్ధికి రూ.5 కోట్లతో టెండర్లు ఖరారు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. పన్నెండు అడుగుల వెడల్పుతో సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని డబుల్‌లేన్ రోడ్డుగా మార్పు చేస్తామని ఐదేళ్ల కిందట హామీ ఇచ్చి టెండర్లు పిలిచారు. అయినా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే జలమయం అయ్యేది. ఎక్కడ గొయ్యి ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియనిస్థితిలోనే ప్రయాణించారు. వర్సిటీలో చదివే విద్యార్థులు, ఉద్యోగులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వణికిపోయారు. రెండేళ్ల కిందట పీజీ కోర్సు చదుతున్న చల్లపల్లికి చెందిన విద్యార్థి ఒకరు ద్విచక్రవాహనంపై వస్తూ, వెనుక వస్తున్న లారీని తప్పించుకునే ప్రయత్నంలో గొయ్యిలోకి వాహనం వెళ్లి కిందపడి గాయాలపాలై మరణించాడు. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శివగంగ సెంటరు నుంచి కోన గ్రామం వరకు రూ.5 కోట్లతో సింగిల్ రహదారిగా అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచారు.

**ఇన్నాళ్లూ మరమ్మతులతో సరిపెట్టారు**

ఐదేళ్ల కిందట వీసీ, ప్రొఫెసర్లు కృష్ణా యూనివర్సిటీ వరకైనా రహదారిని అభివృద్ధి చేయాలని అప్పటి మంత్రి పేర్ని నానికి వినతిపత్రాలు అందజేశారు. శివగంగ సెంటరు సమీపంలోని మంగలేరు వంతెన నుంచి యూనివర్సిటీ వరకు 2,100 మీటర్ల మేర డబుల్‌లేన్ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని పేర్నినాని హామీ ఇచ్చారు. ఈ రహదారి నిర్మాణానికి సర్వే చేసి రూ.10 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచినా ఈ రహదారి పనులు మాత్రం ప్రారంభించలేదు. ఈ టెండర్లు రద్దు కావడంతో సింగిల్ రహదారిగానే అభివృద్ధి చేసేందుకు ప్రస్తుతం టెండర్లు ఖరారయ్యాయి. కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవాల సమయంలో ప్రముఖులు వచ్చినపుడు తాత్కాలికంగా ఈ రహదారికి మరమ్మతులు చేసి సరిపెట్టారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం కౌంటింగ్ ప్రక్రియ యూనివర్సిటీలోనే జరిగింది. అప్పట్లో ఈ రహదారికి మొక్కుబడిగా మరమ్మతులు చేసి సరిపెట్టారు. ఇటీవల కాలంలో పలుమార్లు కలెక్టర్ యూనివర్సిటీకి వచ్చారు. యూనివర్సిటీకి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయిస్తామని చెప్పారు. ఎట్టకేలకు ఈ రహదారికి టెండర్లు పిలిచారు.

**ఒక్కటే రోడ్డు కావడంతో..**

మచిలీపట్నం-కోన రహదారి వెంబడి కోన, పల్లెతుమ్మలపాలెం, పాతేరు, పోలాటితిప్ప, కొనకళ్ల గణపతినగర్ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ రహదారి ఒక్కటే మార్గం. వేలాది మంది ప్రజలు ఈ గ్రామాల నుంచి నిత్యం ఈ రహదారి గుండానే రాకపోకలు సాగించాలి. కృష్ణా యూనివర్సిటీ, రుద్రవరం గురుకుల జూనియర్ కళాశాలకు వెళ్లాలన్నా ఇదొక్కటే మార్గం. యూనివర్సిటీ విద్యార్థులు వెయ్యి మంది, ప్రొఫెసర్లు, సిబ్బంది 200 మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి వెంబడి ఆయా గ్రామాల పరిధిలో వేలాది ఎకరాల చేపలు, రొయ్యల చెరువులున్నాయి. వీటి నుంచి వందలాది టన్నుల మత్స్యసంపద నిత్యం ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రహదారిని పూర్తిస్థాయిలో త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

# బిగుస్తున్న ఉచ్చు!?

## సన్‌సిటీ కాలనీలో రూ.2.50 కోట్ల ఇరిగేషన్ భూముల ఆక్రమణపై కదులుతున్న డొంక

- ఇరిగేషన్ స్థలాలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) వేసిన కార్పొరేషన్
- మూడు సార్లు టౌన్‌ప్లానింగ్ శాఖకు లేఖలిచ్చామంటున్న ఇరిగేషన్ ఏఈ

### ఆరా తీస్తున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సన్‌సిటీ కాలనీలోని భూముల కబ్జా వ్యవహారం అధికారుల మెడకు చుట్టుకుంటోంది. ఇరిగేషన్ భూములని అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టిన తర్వాత కూడా.. దానిని తొలగించి మరీ రిజిస్ట్రేషన్ చేయించటంతో అధికారులు ఎంత ఉదాసీనంగా వ్యవహరించారో అర్థమవుతోంది. సుమారు రూ.2.50 కోట్ల విలువచేసే ఇరిగేషన్ స్థలాలకు దొంగపత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసేసిన వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' సోమవారం వెలుగులోకి తీసుకురావడంతో సన్‌సిటీ కాలనీలో ఇరిగేషన్ భూములను ఎలా రిజిస్ట్రేషన్లు చేయించారు.. ఇరిగేషన్ శాఖ ఏమి చేస్తుంది.. ఫిర్యాదులు అందినా కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ఇరిగేషన్ భూములకు ఏకంగా ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ)ఎలా వేశారు..? ఇరిగేషన్ స్థలంలో ఉన్న భవన నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇచ్చారు.. అసలు ఆక్రమణదారులకు కొమ్ము కాస్తున్న అధికారులెవరూ.. వారికి వత్తాసు పలికిన వైసీపీ నాయకుల పాత్ర ఏంటనే వివరాలను రాబడుతున్నారు. అధికారం అడ్డం పెట్టుకొని అధికారులను ప్రలోభాలకు గురిచేసినట్లు తేలితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళ్లాలని ఆలోచిస్తున్నారు.



అప్పటి వైసీపీ ప్రభుత్వంలో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో కబ్జా భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు (ఫైల్)

**వీఎల్‌టీకి దరఖాస్తు**

సన్‌సిటీ కాలనీలోని 550 గజాల ఇరిగేషన్ స్థలానికి వీఎల్‌టీ(వేకెండ్ ల్యాండ్ ట్యాక్స్) వేయించుకునేందుకు కబ్జాదారుడు 2023, జూలై 25న దరఖాస్తు చేసుకున్నాడు. అలాగే సర్వే నంబరును కూడా మార్చి తద్వారా ఇక్కడి అధికారులను తప్పుదోవ పట్టించడమో లేక అధికారులతో కుమ్మక్కు అవడమో చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఎనీవేర్ విధానాన్ని అవకాశంగా మార్చుకుని తద్వారా నూజివీడులో రిజిస్ట్రేషన్ చేయించనట్లు సమాచారం.

**దొంగ రిజిస్ట్రేషన్లు**

అన్యాక్రాంతమైన స్థలం ఇరిగేషన్ శాఖకు చెందినదిగా ఆ శాఖ అధికారులు హెచ్చరికల బోర్డులు పెట్టిన భూమి వైసీపీ నేతకు రిజిస్ట్రేషన్ మిగతా 8లో..

# ఆక్వాలో ఆక్రందనలు



**ఆర్థిక ఆటుపోట్లలో జిల్లా రైతులు**

- ఆక్వాజోన్ హోదా ఇస్తేనే అభివృద్ధి
- విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు
- వైసీపీ హయాంలో తొలగించిన సబ్సిడీ..

10లో



గుడ్లు పెడుతున్న తాబేలు

# పర్యావరణహిత ఆలివ్‌రిడ్లే

## సముద్ర జీవరాశుల మనుగడకు దోహదం

తాబేళ్ల పరిరక్షణకు వన్యప్రాణి సంరక్షణ విభాగం చర్యలు

8లో


తిరుపతమ్మ ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

## తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.93.40 లక్షలు

**పెనుగంచిప్రోలు, ఫిబ్రవ 4 (ఆంధ్రజ్యోతి)** : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అలయంలోని హుండీల కానుకలను జగ్గయ్యపేట గ్రూప్ దేవాలయాల ఈవో పి.జయప్రకాష్ పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో రూ.93,40,492 నగదును, 198 అమెరికన్ డాలర్లు, ఐదు ఆస్ట్రేలియా డాలర్లు, 40 యూరోలు, థాయ్ కరెన్సీ(థాయ్ బహత్‌లు) 50, బంగారం 86 గ్రాములు, 1,350 గ్రాముల వెండి మొత్తం 111 రోజులకు సమర్పించినట్లు డిప్యూటీ కమిషనర్ వి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్ తెలిపారు. ఆలయ సిబ్బందితో పాటు ధర్మకర్తలు, విజయవాడకు చెందిన శ్రీ దుర్గా శివసాయి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


జెండా ఊపి ఆర్టీసీ బస్సు యాత్రను ప్రారంభిస్తున్న బందరు ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు

## కుంభమేళాకు బందరు నుంచి ఆర్టీసీ బస్సులు

**మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)** : ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు మచిలీపట్నం నుంచి మంగళవారం ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడిపారు. ఈ సర్వీసులను డిపో మేనేజర్ పెద్దిరాజు, అసిస్టెంట్ మేనేజర్ ఎం.ఎం. ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. సీనియర్ డ్రైవర్ జీ. దేవా పాల్గొంటున్నారు. బస్సులోనే వంట మేస్త్రి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు జరిగే ఈ యాత్రలో బంధువులు, స్నేహితులతో సహా కుంభమేళాకు బయలుదేరారు.

## కృష్ణావర్సిటీ అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

**వన్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)** : కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు కేబీఎన్ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టీ శేషయ్య పోటీలను ప్రారంభించారు. విద్యా సంస్థల పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి కృష్ణవేణి, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ టి శ్రీనివాస్, యూనివర్శిటీ సెలక్షన్ కమిటీ సభ్యుడు మేజర్ మన్నే స్వామి, కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావు తదితరులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఉత్తమ క్రీడాకారులను యూనివర్శిటీ జట్టుగా ఎంపిక చేసి తమిళనాడులో త్వరలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల హ్యాండ్ బాల్ పోటీలకు పంపిస్తారు.

కానూరు కార్పొరేట్ కళాశాలలో

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**పెనమలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)** : కార్పొరేట్ కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని కానూరులో జరిగింది. కానూరులోని ఒక ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలో తోట్లవల్లూరు మండలం గురువిందపల్లి గ్రామానికి చెందిన గుర్రం వేణునాథ్ (18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ మ్యాథ్స్ సబ్జక్టులో ఫెయిలవడంతో హాస్టలులోనే ఉంటూ చదువుకుంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఒం టిగంట సమయంలో తాను ఉంటున్న హాస్టలు రూం లోనే ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారం కారణంగానే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు సంఘటనా స్థలంలో దొరికిన సూసైడ్ నోట్‌లో ఉన్నట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకొన్న విద్యార్థి తల్లిదండ్రులు కళాశాల వద్దకు వచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమారుడు పిరికివాడు కాదని, ఆత్మహత్య చేసుకోవాల్సిన అవ సరం అతనికి లేదన్నారు. కళాశాల సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం చేశారు. సూసైడు నోటులో చేతిరాత తమ కుమారుడిది కాదని, అతడి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని కళాశాల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వీడని దంపతుల మృతి మిస్టరీ

**చల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)** : చల్లపల్లిలో కలకలం రేపిన భార్యాభర్తల జంట మరణాలకు కారణం ఏమై ఉంటుందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. భర్త బండ్రెడ్డి సాంబశివరావు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తుండగా, భార్య దారపురెడ్డి జమున మరణం విషయమై స్పష్టత రాలేదు. వరుసకు మేనమామ, మేనకోడలు అయ్యే సాంబశివరావు, జమున రెండో వివాహం చేసుకున్నట్లు బంధువర్గం చెబుతున్నారు. జమునకు మొదటి వివాహానికి కుమారుడు ఉండగా, సాంబశివరావుకు సైతం కుమార్తె ఉంది. ఇద్దరికీ సంతానం ఉండి కూడా వారిని విడిచిపెట్టి చనిపోయేందుకు దారితీసిన పరిస్థితులు ఏమిటన్నది ప్రశ్నగా మిగిలింది. ఇరువురి నడుమా గొడవలేమైనా జరిగి, ఆ తొందరపాటులో ఆత్మహత్యకు పాల్పడ్డారా, లేక ముందుగానే నిర్ణయించుకుని బల వన్మరణం పొందారా అన్నది స్పష్టం కావాలి. వారి నడుమ వివాదాలేమీ లేవనే అభిప్రాయాలు బంధువర్గం చెప్పినప్పటికీ, డబ్బు విషయమై మనస్పర్థలు ఉన్నాయని సమాచారం. జమున కుమారుడి కోసం చల్లపల్లిలో ఇల్లు నిర్మిస్తోందనీ, అదే సమయంలో సాంబశివరావు సైతం తలగడదీవిలో ఇంటికి మరమ్మతులు చేయిస్తున్నట్లు చెబుతున్నారు. ఆర్థికంగా ఒకరి సహకారం మరొకరు పొందాలనే ఆలోచనలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయంటున్నారు. జమున ఏఆర్‌టి సెంటరులో ఉద్యోగం చేస్తుండటం, కుమారుడు సైతం పనిచేస్తుండటంతో వారి నుంచి సాంబశివరావు డబ్బులు ఆశిస్తూ ఉండవచ్చనే అభిప్రాయాలున్నాయి. నెల మొదటి రోజుల్లో వచ్చివెళుతున్నాడనే విషయం ఆ అనుమానానికి బలాన్నిస్తోంది. బంధువర్గంతో కుటుంబ వివరాలు తెలుసుకున్న పోలీసులు భార్యాభర్తల నడు మ వివాదాల విషయమై ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

### శవపరీక్ష నివేదిక వస్తేనే ...

జమున మరణం ఆత్మహత్యా, హత్యా అన్నది తెలియాలంటే శవపరీక్ష నివేదిక రావాల్సిందేనని చెబుతున్నారు. జమునది ఆత్మహత్య కాకపోవచ్చని, హత్య అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంచంపై నిద్రిస్తున్నట్లుగా ఉండటం, గదిలో ఘర్షణ జరిగిన ఆనవాళ్లు లేకపోవటంతో ఆత్మహత్య గానే భావిస్తున్నారు. ఒకవేళ హత్య జరిగి ఉంటే మాత్రం ఊపిరి ఆడకుండా చేసి ఉండే అవకాశాలు ఉండొచ్చనే భావన వ్యక్తమవుతోంది. నిద్రమాత్రలు మింగినా, విషపదార్థం తీసుకున్నా, ఊపిరి ఆడకుండా చేసినా ఆ విషయం శవపరీక్ష నివేదిక ద్వారానే స్పష్టమయ్యే అవకాశం ఉంది. అవనిగడ్డలో శవపరీక్ష చేసిన వైద్యులు ఇం దుకోసం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపినట్లు తెలుస్తోంది. జంట మరణాల మిస్టరీ వీడాలంటే నివేదిక రావాల్సిందే. కారణాలు ఏమైనా, మరణాలు ఎందుకు, ఎలా జరిగినా ఇద్దరి మరణంతో వారి పిల్లలు అనాధలుగా మారారు.

# నేత్రపర్వం..సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

**మోపిదేవి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)** : వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవాన్ని దేవస్థానం అధికారులు, అర్చకులు ఆహ్లాదభరితంగా నిర్వహించారు. శేషవాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయుల తరపున నూతన పట్టువస్త్రాలను అర్చకులకు సమర్పించారు. ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్లను కల్యాణ మూర్తులుగా అలంకరణ చేసి కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మంగళధారణ ఘట్టాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సంప్రదాయబద్దంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించగా, భక్తులు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. ఎస్టేట్ దేవాలయాల ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు దంపతులు కలాణంలో పాల్గొనగా, అవనిగడ్డ డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణలు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.


స్వామివార్ల మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న వేదపండితులు



### ← వైభవంగా రథోత్సవం

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, అవనిగడ్డ డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, విద్యుత్ దీపాలు, పూలమాలలతో విశేష అలంకరణ చేసిన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొబ్బరికాయ కొట్టి తాడును లాగి స్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తజనుల జయజయ ధ్వానాలతో స్వామివారి రథోత్సవం పుర వీధుల్లో ముందుకు సాగింది. రథంపై ఆశీనులై స్వామివారు ఊరేగింపుగా పురవీధుల్లో వస్తుండగా, గ్రామస్థులు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించి దర్శించుకున్నారు. అవనిగడ్డ డిఎస్పీ టి.విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని పోలీ సు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# పర్యావరణహిత ఆలివ్ రిడ్లే

**● తాబేళ్ల పునరుత్పత్తికి వన్యప్రాణి సంరక్షణ విభాగం కృషి ● గుడ్ల సంరక్షణకు పటిష్ట చర్యలు**

కాలుష్యం అన్ని జీవరాశులకు పెనుముప్పుగా తయారైంది. కాలుష్య నివారణకు అందరూ నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రమాదకరమైన, పారిశ్రామిక కాలుష్యం నుంచి సముద్ర తీర ప్రాంతాన్ని ఆలివ్ రిడ్లే జాతి సముద్ర తాబేళ్లు కాపాడుతున్నాయి. తద్వారా సముద్రంలోని సకల జీవరాశుల మనుగడకు దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్ల సంరక్షణకు అటవీశాఖలోని వన్య ప్రాణి సంరక్షణ విభాగం అవిరళ కృషి చేస్తోంది. సముద్రంలో పెరిగే నాచు, వ్యర్థాలను తాబేళ్లు తొలగించి ఇతర జీవరాశుల మనుగడకు దోహదం చేస్తున్నాయని అధికారులు తెలిపారు. జనవరి నుంచి మార్చి వరకు తాబేళ్ల పునరుత్పత్తి సమయం కావడంతో వాటి గుడ్లను జాగ్రత్తగా సేకరించి, భద్రపరచి, తాబేళ్ల సంతానోత్పత్తికి వన్యప్రాణి సందరక్షణ విభాగం చేస్తున్న అవిరళ కృషిపై ప్రత్యేక కథనం


సముద్రతీరంలో ఆలివ్ రిడ్లే జాతి తాబేలు


సొర్లగొందిలో తాబేళ్ల సంక్షరణ హేచరీ

**(ఆంధ్రజ్యోతి-నాగాయలంక)**

అవనిగడ్డ అటవీశాఖ రేంజ్ పరిధిలో సుమారు 50 కిలోమీటర్లు సముద్రతీరం ఉంది. కోడూరు మండలం నుంచి నాగాయలంక మండలం మీదుగా బాపట్ల జిల్లాలోని కొత్తపాలెం మండలం మూరగుంట వరకు అవనిగడ్డ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉంది. ఈ కేంద్రం పరిధిలో ఆరు గస్తీ ప్రదేశాలు ఉండగా, నాగాయలంక మండలంలో సొర్లగొంది, నాచు గుంట, ఈలచెట్లదిబ్బ, గుల్లలమోద ఉండగా, కోడూరు మండలంలో పాలకాయితిప్ప, బాపట్లలో లంకేవానిదిబ్బ బీట్లు ఉన్నాయి. వీటిలోని సంగమేశ్వరంలో ఒకటి, గుల్లలమోదలో రెండు, జింకపాలెంలో ఒకటి, పాలకాయితిప్పలో ఒకటి తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను వన్య ప్రాణి సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిధులను కేటాయించి జనవరి నెల నుంచి మార్చి మాసం వరకు వీటిని నిర్వహిస్తున్నారు. తాబేళ్ల పునరుత్పత్తి సమయంలో ఉదయం వందలాది తాబేళ్లు తీరానికి వచ్చి వేలాది గ్రుడ్లను గుంటలు తీసి పెడతాయి. ఆ గుడ్లను మెరైన్ యానిమల్ సిబ్బంది సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హేచరీలో గుంటలు తీసి రెండు నెలలపాటు నక్కలు, కుక్కలు, ఇతర జంతువుల బారి నుంచి కాపాడతారు. పునరుత్పత్తికి వచ్చిన ఒక్కో క్క తాబేలు ఉదయం నుంచి రాత్రి వరకు 40 నుంచి 60 గ్రుడ్లకుపైగా ఒకే సారి గజం లోతు గుంటను తీసి గబగబా పెట్టి సముద్రంలోకి వెళ్లిపోతాయి. ప్రతీ యేటా 70 వేలకు పైగా గుడ్లను సేకరించి పొదిగిన పిల్లలను సముద్రంలోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాదిలో ఐదు కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 50 తాబేళ్ల మూడు వేల గుడ్లను పెట్టగా, వాటిని సేకరించి హేచరీలో భద్రపర్చినట్లు సొర్లగొంది మెరైన్ యానిమల్ సంరక్షుడు నాగరాజు తెలిపారు.


తీరంలో గుడ్లు పెడుతున్న తాబేలు, సేకరించిన గుడ్లను హేచరీ గొయ్యిలో భద్రపరుస్తున్న సిబ్బంది, గుడ్లను నమోదు చేసి సంరక్షణ చర్యలు చేపడుతున్న సిబ్బంది

### తాబేళ్ల గుడ్ల సంరక్షణ ఇలా..

తాబేళ్లు గుంటలు తీసిన ప్రాంతాలను సిబ్బంది గుర్తించి, వాటి గుడ్లను భద్రంగా సేకరించి, హేచరీకి కేటాయించిన స్థలంలో గొయ్యి తీసి పెట్టి, ఇసుకతో పూడ్చి పెట్టి వాటికి వరుస సంఖ్యను నమోదు చేస్తారు. వాటిని బుట్టలతో భద్ర పరుస్తారు. హేచరీలో పెట్టి పూడ్చిన గుడ్ల నుంచి సుమారు 45 నుంచి 60 రోజుల్లో తాబేళ్ల పిల్లలు బయటకు వస్తాయి. వాటిని సిబ్బంది లెక్కించి సముద్రంలోకి సిబ్బంది వదులుతారు. వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారులు , రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను పర్యవేక్షించి తాబేళ్ల సంతతిని కాపాడుతూ తీర ప్రాంతాలు కలుషితం కాకుండా అవిరళ కృషి చేస్తున్నారనటంలో ఎలాంటి సందేహం లేదు.

## మంత్రి లోకేశ్‌కు ఢిల్లీలో ఘనస్వాగతం

**వన్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)** : విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఢిల్లీ విమానాశ్రయంలో మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఘనస్వాగతం పలికారు. రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు రూ.9,417 కోట్లు కేటాయించినందుకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపేందుకు మంత్రి లోకేశ్ ఢిల్లీ వచ్చారు. కేశినేని శివనాథ్‌తో పాటు పుట్టా మహేష్ కుమార్, గంటి హరీష్, సానా సతీష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


ఢిల్లీలో మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీలు కేశినేని శివనాథ్, పుట్టా మహేష్ తదితరులు

## రెవెన్యూ అర్జీలు 96శాతం పరిష్కారం : లక్ష్మీశ

**ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)** : ఎన్టీఆర్ జిల్లాలో 33 రోజుల పాటు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 3,111 అర్జీలు రాగా, 3,015 (96 శాతం) పరిష్కరించామని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. సీసీఎల్ఏ జి.జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు, పరిష్కారం అంశాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి హాజరయ్యారు. అర్జీల పరిష్కారంలో జిల్లాను మెరుగైన స్థానంలో నిలుపుతున్నట్లు వివరించారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)కు సంబంధించి 105 అర్జీలు నమోదు కాగా 102 అర్జీలను, రీసర్వేకు సంబంధించి 148 రాగా 137 అర్జీల పరిష్కారం పూర్తయినట్లు తెలిపారు. అసైన్డ్ భూములకు సంబంధించి 272 అర్జీలు రాగా 269 అర్జీలను పరిష్కరించా మన్నారు. 22 ఏకు సంబంధించి 105 అర్జీలకు గాను 102 పరిష్కార మయ్యాయన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, సూపరింటెండెంట్ సీహెచ్.దుర్గాప్రసాద్, చంద్రమౌళి పాల్గొన్నారు.

## బిగుస్తున్న ఉచ్చు!?

(7వ పేజీ తరువాయి)

కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. తమ అక్రమాలకు అడ్డుతగిలే అధికారులపై బెదిరింపులకు పాల్పడడం. తన దారిలోకి వచ్చేలా అమ్యామ్యాలు చెల్లించడం వంటివి ఆక్రమణదారుడు చేసేవాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ఉపయోగించిన అక్రమార్కులు స్థలాన్ని గుట్టుచప్పుడుకాకుండా నూజివీడులో రిజిస్ట్రేషన్ చేయించడంలో కొంతమంది అధికారులు ఇతగాడికి దాసోహమై పనిచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కబ్జాదారుల రిజిస్ట్రేషన్ చేయించుకున్న 550 గజాల ఇరిగేషన్ భూమి 32 సర్వే నంబరులో ఉంది. అయితే 31/1ఏ సర్వే నంబరు చూపిస్తూ భూమిని తన కొడుకుల పేరుతో ఆ వైసీపీ నేత నూజివీడులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టుగా తెలుస్తోంది.

### మూడు సార్లు కార్పొరేషన్‌కు లేఖలు రాశాం : ఇరిగేషన్ ఏఈ

ఇరిగేషన్ భూమి ఆక్రమణలకు గురవుతుందని గుర్తించిన మీదట రక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగానికి మూడుసార్లు లేఖలు రాశాం. గతంలో ఇరిగేషన్ శాఖ భూములని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి మరోసారి తీసుకువెళ్లి ఆక్రమణలకు ప్రయత్నిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

### ఇంటి ప్లాన్‌లు చూసి పన్నులు వేశాం : శ్యామ్. కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

అవి ఇరిగేషన్ భూములని మాకు తెలీదు. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం ఆ ప్రాంతాలలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఆ ప్లాన్‌ల ప్రకారమే మేము వాటికి పన్నులు వేశాం.

### స్పందించని టీపీవో... చర్యలు తీసుకుంటామన్న ఏసీపీ

ఈ భూకబ్జా వ్యవహారంపై కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ టీపీవో మధిన్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోనులో సంప్రదించగా స్పందించలేదు. దీనిపై ఏసీపీ రాంబాబును వివరణ కోరగా తాను సెంట్రల్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టి రెండు నెలలే అయ్యిందని.. ఈ భూకబ్జాల వ్యవహారంపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు

## వరించిన పదవి

(7వ పేజీ తరువాయి)

ఒప్పించుకోగలిగారు.

### స్వతంత్ర అభ్యర్థిని బరిలో నిలిపేందుకు సైతం..

సోమవారం అర్ధరాత్రి వరకూ జరిగిన మంతనాలు మంగళవారం ఉదయం కూడా కొనసాగాయి. చివరకు అధిష్టానం సౌమ్యకు ఒక ప్రతిపాదన పంపింది. ఎంపీ సూచించిన స్వర్ణలత, సౌమ్య సూచించిన కామసాని సత్యవతిలకు కాకుండా మధ్యమార్గంగా పదవ వార్డుకు చెందిన మండవ కృష్ణకుమారి పేరు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలు, ఆదేశాలను పక్కకు తోసిన సౌమ్య ఖాళీ బీఫారం పంపితే తన నిర్ణయం ప్రకారం అభ్యర్థిని ఎంపిక చేసుకుంటానని తేల్చి చెప్పినట్లు సమాచారం. అనుక్షణం ఒత్తిడి పెరగడంతో పది గంటలకు పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా, 9 గంటలకే కౌన్సిలర్లను వెంటపెట్టుకొని సౌమ్య ఎన్నికల కేంద్రానికి వెళ్లారు. సమావేశ మందిరంలోకి వెళ్లిన తర్వాత కూడా సిఫార్సుల కాల్స్ వస్తుండడంతో అందరి ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేయించి బయటకు పంపారు. సీనియర్ నాయకురాలు కామసాని సత్యవతికి ఛైర్‌పర్సన్ పదవి ఇవ్వనున్నట్లు సౌమ్య అప్పటికే పలు మార్లు పార్టీ పెద్దలకు తెలియజేశారు. ఎన్నికల హాల్‌లో కూడా కౌన్సిలర్లతో మాట్లాడుతూ సత్యవతి పేరు ప్రస్తావించినట్లు తెలిసింది. తాను కోరిన విధంగా ఖాళీ బీఫారం అందక పోతే స్వతంత్ర అభ్యర్థిగా తాను మద్దతు ఇచ్చే అభ్యర్థిని బరిలోకి దింపేందుకు సౌమ్య సిద్ధపడ్డారు. ఈ తరుణంలో జోక్యం చేసుకున్న మునిసిపల్ మంత్రి నారాయణ సౌమ్యతో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు మధ్యమార్గంగా మండవ కృష్ణకుమారిని ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించాలని సూచించారు. అధిస్టానం ఆదేశాలను సౌమ్య గౌరవించడంతో ఆఖరి నిముషంలో కృష్ణకుమారికి ఛైర్‌పర్సన్ పీఠం దక్కింది.

## భూ మాయ!

(7వ పేజీ తరువాయి)

సందర్భంలో ఈ భూముల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. అప్పటికి కానీ భూములను కొని మోసపోయామని కొనుగోలుదారులకు అర్థం కావటం లేదు. చిట్టచివరి కొనుగోలుదారుడు ఎవరైతే ఉంటారో వారు నష్టపోతున్నారు. ఎవరినీ ప్రశ్నించలేని పరిస్థితి. దీనికి వారు కొన్న భూమి అప్పటికే అనేక మంది చేతులు మారి ఉండటమే కారణం. చైన్ లింక్‌గా విచారించుకుంటూ పోతే అసలు మొట్టమొదటి డాక్యుమెంట్ కలిగిన వారు జీవించే ఉండరు.

అక్రమ రిజిస్ట్రేషన్లతో తలనొప్పులు

ఈ భూ మాయలో అక్రమ రిజిస్ట్రేషన్లే ప్రధానం.

వాస్తవానికి ఉన్న సర్వే నంబర్లు కాకుండా వాటి మీద ఏ, బీ అంటూ రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో పలువురు డాక్యుమెంట్ రైటర్ల హస్తం కూడా ఉంది. విజయవాడ శివారు ప్రాంతాల్లో పనిచేసే కొంతమంది వీఆర్‌వోలు డాక్యుమెంట్ రైటర్లుగా కూడా అవతారం ఎత్తి ఉన్నారు. దాదాపుగా దశాబ్దంన్నర అంతకు మించి కూడా ఇదే ప్రాంతాల్లో గ్రామాలు మారుతూ పనిచేస్తున్నారు. కొంతమంది వీఆర్‌వోలకు ప్రైవేటుగా డాక్యుమెంట్ రూపకల్పన చేసే ఆఫీసులు కూడా ఉన్నాయి. రెవెన్యూ తమ చేతిలో ఉండటం, డాక్యుమెంట్ రైటర్లుగా కూడా చెలామణిలో అవ్వడంతో..

ఇంకేముంది? అక్రమ రిజిస్ట్రేషన్లకు అందించాల్సిన సహకారం అంతా అందించేస్తున్నారు. ఎఫ్ఎంబీలో మార్పులు చేసి కాపీలు మార్చటం, ఎఫ్ లైన్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయించటం, తహసీల్దార్ల పేరిట నకిలీ ఎన్‌వోసీలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించటం వంటి పాపాలు చేశారు. అవినీతికి అలవాటు పడిన సబ్ రిజిస్ట్రార్లు కూడా అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసేశారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
| --- | --- |
| బ్రాయిలర్ బర్డ్ | 125,134, 145 |
| చికెన్ విత్ స్కిన్ | 240 |
| చికెన్ స్కిన్‌లెస్ | 250 |



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**గన్నవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని ఆర్టీసీ డీపీటీవో ఎ.వాణిశ్రీ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో జరుగుతున్న రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డ్రైవర్‌లకు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ బస్సు నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం గాని ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర నియమాలు పాటించకపోయినా చర్యలు ఉంటాయన్నారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. డిపో మేనేజర్ పి.శివాజీ, సూపర్‌వైజర్‌లు మధు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత తుమ్మలపల్లి హరికృష్ణ

## 150 మందికి కళ్లజోళ్లు పంపిణీ

**కంకిపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** బడుగు, బలహీన వర్గాలకు తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో అవసరమైన పేదలకు కళ్లజోళ్లు మంగళవారం కుమార్తె నాగహరి చందనతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, ఇటీవల శంకర కంటి ఆసుపత్రి వైద్యసిబ్బంది సహకారంతో కంకిపాడులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించటం జరిగిందని, అవసరమైన 150మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చలవాది రాజా గురవయ్య, నాగేశ్వరరావు, షేక్ బాజి, జనసేన పార్టీ నాయకులు నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పుల్లేరు కాల్వలో పడి యువకుడి మృతి

**ఉయ్యూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** ఉయ్యూరులో ఫ్లోరా స్కూల్ సమీపాన వంతెనపై కూర్చుని ప్రమాదవశాత్తు పుల్లేరు కాల్వలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పట్టణ ఎస్సై విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూలీపనులు చేసుకుని జీవించే సుందరయ్య నగర్‌కు చెందిన యడ్ల రాంబాబు (25) మధ్యాహ్న సమయంలో ఫ్లోరాస్కూల్ జంక్షన్ వద్ద వంతెనపై కూర్చుని ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయాడు. గమనించిన స్థానికులు కాల్వలో దిగి వెతికి మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని తండ్రి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## నెప్పల్లిలో పోలీసు పికెట్



**కంకిపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** నెప్పల్లిలో పోలీసు పికెట్ కొన సాగుతోంది. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో ఆదివారం అర్ధరాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా సీఐ మురళీకృష్ణ ఆదేశాలకు అనుగుణంగా ఎస్సైలు డి. సందీప్, తాతాచార్యులు నెప్పల్లిలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అదే విధంగా వివాదాస్పద స్థలంలో పోలీసులు సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలన్నారు.



# ప్రయాణం నరకప్రాయం!

- గుంతలమయంగా ముదునూరు రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు

**(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)**

గుంతలమయంగాఉన్న ముదునూరు రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. కాటూరు నుంచి ముదునూరు, అప్పికట్ల వరకు రోడ్డుపొడవునా పెద్ద గుంతలు పడి వాహనాలు నడిపేవారు అవస్థలు పడుతున్నారు. కాటూరు బోళ్లపాడు, ముదునూరు గ్రామాల ప్రజలు ద్విచక్రవాహనాలపై వెళ్లాలంటే భయపడిపోతున్నారు. అడుగడుగునా రోడ్డుపై గుంతలు, కొన్ని చోట్ల రోడ్డు కుంగి పెద్ద ఆఘాదం ఏర్పడగా ఉయ్యూరు నుంచి కాటూరు, బోళ్లపాడు, ముదునూరు, అప్పికట్ల, పెదపారుపూడి మీదుగా గుడివాడకు వెళ్లే ఆర్టీసీ బస్సులు నడిపేందుకు డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై బస్సులు వెళుతుంటే బస్సు పార్టులు కదిలి ఊడిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.



ముదునూరు-బోళ్లపాడు మధ్య రోడ్డు



ఉప్పులూరులో కేన్సర్‌పై అవగాహన ర్యాలీలో డాక్టర్ సంజు.. వీరవల్లి ర్యాలీలో డాక్టర్ కిరణ్మయి

# కేన్సర్‌ను జయించొచ్చు

- ప్రపంచ కేన్సర్ దినోత్సవం సదర్భంగా వాడవాడలా అవగాహన ర్యాలీలు, సదస్సులు

**హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** దురలవాట్లకు దూరంగా ఉంటూ మంచి ఆహారాన్ని తీసుకుంటే కేన్సర్ మహమ్మారిని జయించవచ్చని చిన్న అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ కమ్యూనిటీ ప్రధాన వైద్యులు జె. రవికుమార్ తెలిపారు. కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో 8, 9, 10 తరగతి విద్యార్థులకు సిద్ధార్థ వైద్య బృందం కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా కేన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వేలేరు ప్రాంతీయ విభాగం వైద్యులు సాయికిరణ్, హెచ్‌ఎం టీవీ.నాగేశ్వరరావు, వైద్య ఆరోగ్య విశ్రాంతి ఉద్యోగి సూర్యనారాయణ, వైద్య విద్యార్థులు సాకేత్, భరత్, మోషీన, విజయశ్రీ పాల్గొన్నారు.

### వీరవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** కేన్సర్‌ని తొలిదశలోనే గుర్తిస్తే నివారించడం సాధ్యమవుతుందని, మానసిక ధైర్యంతో సరైన వైద్య చికిత్సల ద్వారా కేన్సర్‌ను జయించవచ్చని డాక్టర్ కిరణ్మయి సూచించారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ, సదస్సు, మానవహారం నిర్వహించారు. కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యం, ముందస్తు వైద్య పరీక్షలతోనే కేన్సర్ నుంచి రక్ష అంటూ నినాదాలు చేశారు. పీహెచ్‌ఎస్ సౌదామని, ఎంపీహె చ్‌ఎస్ ప్రదీప్‌సన్, ఓఎ ఏడుకొండలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కేన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ జె.వందన

### కేన్సర్‌పై అవగాహనుండాలి

**గన్నవరం :** కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ జె.వందన అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాల, పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులతో కేన్సర్‌కు వ్యతిరేకంగా నివారణ, సూచనలు తెలుపుతూ, క్యాన్సర్‌ను ముందే గుర్తించు-ప్రాణాన్ని రక్షించు నినాదాలు చేశారు. అవగాహనతోనే క్యాన్సర్‌ను జయించవచ్చని తెలిపారు. పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ ఎస్. రాజగోపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రశాంతి పాల్గొన్నారు.

### ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

**కంకిపాడు :** తొలి దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న సిద్ధార్థ వైద్యబృందం

వైద్యాధికారి సంజు అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉప్పలూరు పీహెచ్‌సీలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి నిఖిత, ఎంపీహెచ్‌ఈవోలు కృష్ణారావు, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు శ్యామల, శారమ్మ, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### తొలిదశలోనే గుర్తించాలి

**ఉయ్యూరు :** కేన్సర్‌ను తొలిదశలో గుర్తించి చికిత్స పొందితే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ నాగస్వరూప అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కేన్సర్ నివారణ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మండవ జయదేవ్, అసోసియేషన్ జిల్లా డిప్యూటీ గవర్నర్ పి రాము, ఆరోగ్య విభాగ చైర్మన్ ఎస్ తిరుమలరావు, చైర్‌పర్సన్ ఎన్ రాంబాబు, ఉయ్యూరు అసోసియేషన్ అధ్యక్షుడు కె సాంబశివరావు, సెక్రటరీ చంటిబాబు, ఎం రాజు, బాలా ప్రసాద్, నెహ్రూ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కళాశాల జంతుశాస్త్ర విభాగం, ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జంతు శాస్త్ర విభాగ అధ్యాపకులు కిరణ్మ యి, సుభాషిణి, పద్మజ పాల్గొన్నారు.
- హోప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 75మంది మహిళలకు స్క్రీనింగ్ టెస్ట్ ఇతర వైద్యపరీక్షలు చేశారు. క్యాన్సర్‌ను ముందుగ ఎలా గుర్తించాలో హాస్పిటల్ అధినేత ఎం జాన్‌డేవిడ్, గైనకాలజిస్ట్ ఎస్‌కె సమీర అవగాహన కల్పించారు.



డాక్టర్ నాగస్వరూపను సత్కరిస్తున్న ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



పాలకేంద్రం అధ్యక్షురాలు విజయలక్ష్మిని సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

## పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం

- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

**గన్నవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** పశుపోషకులను ప్రోత్సహించి పాడి పరిశ్రమలకు పూర్వవైభవం తేవడమే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యమని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నం పాలకేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. యూనియన్ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని కేకును కట్ చేశారు. సొసైటీకి పాలుపోస్తున్న పాడి రైతులను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1965 ఫిబ్రవరి 11న పామర్రులో పాలసేకరణకు తొలి అడుగు పడిందని, అప్పటి నుంచి అంచెలంచెలుగా యూనియన్ అభివృద్ధి బాటలో ముందుకు వెళుతూ పశుపోషకులను ప్రోత్సహిస్తూ వస్తుందన్నారు. ప్రభుత్వ నిధుల నుంచి రూ.4.12 కోట్లు, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు గ్రాంటు రూ.4.12కోట్లతో రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తుపై మరో రూ.4.12 కోట్లు రుణాలను సీఎం చంద్రబాబు ఇప్పించారని తెలిపారు. దీంతో ఆర్థిక కష్టాల నుంచి బయటపడినట్లు తెలిపారు. పాలకేంద్రం అధ్యక్షురాలు కొమ్మినేని విజయలక్ష్మి, విజయ డెయిరీ డైరెక్టర్‌లు పాలడుగు నాని, పలగాని కొండలరావు, రూట్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, కొమ్మినేని నిర్మల, అన్నే కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని బ్లెస్సీనేహాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు

**గన్నవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** దంత వైద్య విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మూల్పూరి వెంకట రామోజీరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో బీడీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.బ్లెస్సీనేహా జనవరి 28 నుంచి 30 వరకూ హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ 2024-25 పోటీల్లో సీనియర్ ఉమెన్ 53 కేజీల కేటగిరిలో పాల్గొని చక్కటి ప్రతిభను ప్రదర్శించి క్యాంస్య పతకాన్ని సాధించారు. మంగళవారం బ్లెస్సీ నేహా అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు మాట్లాడుతూ, విద్యార్థినులకు తప్పని సరిగా మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం ఉండాలన్నారు. ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఏవో వై.మధుసూధనరావు, కోచ్ అంకమరావు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య

## ఘనంగా సర్పంచ్ సౌజన్య జన్మదిన వేడుకలు

**గన్నవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య జన్మ దిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యా లయంలో కేకును పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాసన్నేని రంగబాబు, టీడీపీ నాయకులతో కలసి కట్ చేశారు. మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకుని సమాజాభివృద్ధికి మరింత పాటు పడాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు జాస్తి ఫణిశేఖర్, పీవీఎస్ఆర్‌కె కృష్ణ, అశోక్, రఫీ, జాస్తి మురళీకృష్ణ, కంభంపాటి కృష్ణకిషోర్, పలువురు వార్డు సభ్యులు, ఎంఈఎఫ్ నాయకులు దేవరపల్లి ఏసుబాబు, కోటేశ్వరరావు, జయరాజు, పంచాయతీ సిబ్బంది తదితరులు బొకేలు అందజేసి సర్పంచ్ సౌజన్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు

**గన్నవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సూర్య కిరణ స్పర్శ దర్శనం, చిన్న పిల్లలకు సామూహికంగా సూర్య నమస్కారాలు చేశారు. 108 మంది మహిళా భక్తులచే స్వామివారికి సామూహిక పొంగళ్లు సమర్పించి నైవేద్యం నివేదించారు. శ్రీఉషాపద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా పలువురు దంపతులు పీటల మీద కూర్చుని కళ్యాణం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

**ఉంగుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మినుముపైరులో తెగుళ్ల నివారణతోపాటు, పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి వీవీఎస్ఆర్ఎస్.హరీష్‌కుమార్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు రసూల్, రాణి పాల్గొన్నారు.



ఆత్కూరులో మినుము పరిశీలిస్తున్న ఏవో హరీష్‌కుమార్

## ప్రాక్టికల్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

**ఉయ్యూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :** ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్ఐఓ సాల్మన్ రాజు అన్నారు. సోమవారం నుంచి ఈ నెల 20 వరకు జరుగనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించారు. జిల్లాలో 78 జనరల్, 15 ఒకేషనల్ కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పరీక్షలపై పలు సూచనలు చేశారు. కమిటీ సభ్యులు నరసింహా రావు, నాగరవి, రమణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణపై జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఓ సాల్మన్‌రాజు

# ఆక్వాలో ఆక్రందనలు

జిల్లాలో ఆక్వా సాగు అంతకంతకూ పెరుగుతున్నా ఆటుపోట్లు మాత్రం తప్పట్లేదు. ఎన్టీఆర్ జిల్లా నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉండటం, సాగుదారులకు విద్యుత్ సబ్సిడీ అందకపోవడమే ఇందుకు కారణం. సబ్సిడీని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎత్తేయడంతో ఈ పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్న వారికి ఆర్థికభారం తప్పలేదు. అయితే, ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు నాన్ ఆక్వాజోన్ పరిధిలోని వారికి కూడా విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, జి.కొండూరు

సహజసిద్ధ వాతావరణం లేకపోయినప్పటికీ జిల్లాలో ఆక్వా సాగు విస్తరిస్తోంది. సొంత పొలాలను చేపల చెరువులుగా మార్చుకుని మరీ సాగు చేపడుతున్నారు. పశ్చిమ ప్రాంతంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో 430 ఎకరాలు, తిరువూరు నియోజకవర్గంలో 80 ఎకరాలు, జగ్గయ్యపేటలో 120 ఎకరాల చొప్పున చేపలు, రొయ్యల చెరువులున్నాయి. అయితే, అనుకున్నంత తేలిగ్గా సాగు జరగట్లేదు.



రొయ్యల చెరువులో ఆక్సిజన్ కోసం తిరుగుతున్న ఫ్యాన్స్

- ఆర్థిక ఆటుపోట్ల మధ్య జిల్లా రైతులు
- ఆక్వాజోన్ హోదా ఇస్తేనే అభివృద్ధి
- విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు
- వైసీపీ హయాంలో తొలగించిన సబ్సిడీ

### విద్యుత్ చార్జీల భారం

చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ చార్జీలు భారంగా మారాయి. జిల్లాలోని ఈ ప్రాంతమంతా నాన్ ఆక్వాజోన్‌లో ఉండటంతో చేపల, రొయ్యల చెరువులకు అమలుచేసే విద్యుత్ సబ్సిడీ ఈ ప్రాంతానికి వర్తించట్లేదు. దీంతో నాన్ ఆక్వాజోన్ పరిధిలో యూనిట్ విద్యుత్ ధర రూ.4 నుంచి రూ.5 వరకు చెల్లించాల్సి వస్తోంది. అదే ఆక్వాజోన్‌లో ఉండి ఉంటే సబ్సిడీ కింద యూనిట్ విద్యుత్ ధర రూ.1.50కే లభించేది. చేపలు, రొయ్య లకు ఆక్సిజన్ అందించటానికి మోటార్లు ఉపయోగిస్తారు. ఈ మోటార్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలి. లేదంటే చేపలు, రొయ్యలు చనిపోతాయి. దీంతో రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాం లో బాగానే ఉన్న ఆక్వా రైతులు.. 2019-24 మధ్య వైసీపీ హయాంలో కుదేలయ్యారు. అప్పటి వరకు ఇచ్చిన అనేక రాయితీలతో పా టు విద్యుత్ సబ్సిడీని కూడా తొలగించడంతో ఆక్వా రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నా రు. ముఖ్యంగా విద్యుత్ సబ్సిడీ లేక సాగుభారం మరింత పెరిగిందంటున్నారు. ఆక్వాజోన్‌తో సం బంధం లేకుండా నాన్ ఆక్వాజోన్‌లోని ప్రాంతాల్లో చేపలు, రొయ్యల చెరువులకు విద్యుత్‌ను సబ్సిడీపై అందిస్తామని ఎన్నికల ముందు టీడీపీ కూటమి పార్టీ లు హామీ ఇచ్చిందని రైతులు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే అనేకసార్లు ప్రభుత్వ పెద్దలను కలిశామంటున్నారు. త్వరగా నిర్ణయం తీసుకుని ఆక్వాకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరుతున్నారు.

### పెట్టుబడి కూడా రావట్లేదు..



పెరిగిన ఖర్చులతో రొయ్యల పెంపకం భారంగా మారింది. లాభాలు సరే పెట్టుబడి ఖర్చులు వస్తే చాలనిపిస్తుంది. విద్యుత్ సబ్సిడీ వస్తే చాలా వెసులుబాటుగా ఉంటుంది. నీటి నాణ్యత కోసం, రొయ్యలకు ఆక్సిజన్ అందించడం కోసం అధిక ఖర్చవుతోంది. ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి.

- రవి, సాగుదారుడు

### రాయితీలు ఇస్తే బాగుంటుంది



ప్రభుత్వం రొయ్యల సాగుచేసే వారికి రాయితీలు ఇవ్వాలి. అంతేకాకుండా నాణ్యమైన మందులు అందించాలి. ఆక్వాజోన్‌లో ఇచ్చే అన్ని రకాల రాయితీలు నాన్ ఆక్వాజోన్ వారికీ వర్తింపజేయాలి. కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలి. వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నష్టపోయాం. ఇప్పుడైనా లాభాల బాట పట్టకుంటే సాగు మానేయాల్సిన పరిస్థితి వస్తుంది.

- నాని, సాగుదారుడు

### ఆక్వాజోన్‌లో ఉంటేనే విద్యుత్ సబ్సిడీ

- చదువుల సౌభాగ్య చక్రాణి, జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జి అధికారిణి

ఆక్వాజోన్‌లో 10 ఎకరాల్లోపు సాగు చేస్తున్న చిన్న, మధ్యతరగతి చెరువుల సాగు రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ లభిస్తుంది. వారికి మాత్రమే యూనిట్ రూ.1.5కు లభిస్తుంది. మిగిలిన వారికి రూ.3.85 అవుతుంది. నాన్ ఆక్వాజోన్ అయితే, యూనిట్ ధర రూ.5 ఉంటుంది.

## 9న శతాధిక మృదంగ లయ విన్యాసం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దండమూడి రామ్మోహన్‌రావు లయ వేదిక ఆధ్వర్యంలో మృదంగ శబ్దబ్రహ్మ, మృదంగ చక్రవర్తిగా ప్రఖ్యాతిగాంచిన దండమూడి రామ్మోహన్‌రావు 95వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షురాలు ప్రముఖ మృదంగా విద్వన్మని సుమతి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో ఈనెల 9న సాయంత్రం వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 100కు పైగా మృదంగ విద్వాంసులతో మహా బృంద లయ విన్యాసం (శతాధిక మృదంగ వాద్య లయ విన్యాసం) నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతిభ కలిగిన 9 మంది మృదంగ విద్వాంసులు కామరాజు విష్ణుమూర్తి, వంకాయల వెంకట రమణమూర్తి, కూలిపాల శ్రీరామ్ మూర్తి, మండపాక నాగలక్ష్మి, బీవీఎస్ ప్రసాద్, సద్గురు చరణ్, గుంటుకు వెంకట్రావ్, పున్నమరాజు మురళీకృష్ణకు దండమూడి రామ్మోహనరావు పేరిట జ్ఞాపిక పురస్కారాలు అందచేయనున్నట్టు సుమతీ రామ్మోహన్ రావు తెలిపారు.

## బీసీలకు 50శాతం రిజర్వేషన్లపై 6న చలో ఢిల్లీ

- బోను దుర్గా నరేష్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 50శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 6 చలో ఢిల్లీ తలపెట్టినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గ నరేష్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో బీసీల రిజర్వేషన్లతో పాటు ప్రధాన సమస్యలపై తీర్మానించి ప్రధాని మోదీ దృష్టికి వాటిని తీసుకువెళ్తామన్నారు. దేశవ్యాప్తంగా 26రాష్ట్రాల నుంచి బీసీ పార్లమెంట్ సభ్యులు, కేంద్రమంత్రులు సమావేశంలో పాల్గొంటారన్నారు. 5 దశాబ్దాల నుంచి బీసీల కోసం పోరాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగు విక్రమ్, పెంట సాయికిరణ్, మెండెం జ్యోతి, వరప్రకాష్, జవ్వాది సుధీర్, హేమ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

# పేదల బియ్యం పట్టివేత

- రెండు లారీల్లో 54 టన్నులు తరలింపు
- కాపు కాసి పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులిగడ్డ టోల్‌గేట్ వద్ద మంగళవారం అక్రమంగా తరలిపోతున్న 54 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల నుంచి ఒంగోలు, శ్రీహరి కోట ప్రాంతాలకు లారీల్లో తరలిపోతుందన్న సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఉదయం పులిగడ్డ చెక్‌పోస్టు వద్ద కాపు కాసి పట్టుకున్నారు. రెండు లారీల్లో దాదాపు 54 వేల కిలోల బియ్యం తరలిపోతుండటాన్ని గుర్తించిన అధికారులు ఈ రెండు లారీలను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మచిలీపట్నం నుంచి వస్తున్న ఒక లారీలో 25వేల కిలోల బియ్యం, రెండో లారీలో 29వేల కిలోల బియ్యాన్ని పెడన మిల్లు నుంచి ఒంగోలు మిల్లుకు తరలిస్తున్నట్టు ట్రక్ షీట్ ఉండటంతో ఆ లోడ్‌లోని బియ్యం శాంపిల్స్‌ను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ బియ్యం మొత్తం పీడీఎస్ బియ్యమేనని అధికారులు నిర్ధారణకు వచ్చి లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ సీఐ ఉమర్ నేతృత్వంలో విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టగా, హిందుపూర్‌కు చెందిన మహబూబ్ బాషా, పెడన మండలానికి చెందిన మెండు రాంబాబును అరెస్టు చేశారు.



పట్టుబడిన బియ్యాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

### మైలవరం బైపాస్‌రోడ్డులో 2 టన్నులు స్వాధీనం

మైలవరం: రేషన్ బియ్యం అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రతినెలా 1వ తేదీన పలుప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇలా రవాణా చేస్తున్న 2 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి ఎస్సై సుధాకర్ సిబ్బందితో దారి కాసి మైలవరం బైపాస్ రోడ్డులో స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా రేషన్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా పెద్ద ఎత్తున రేషన్ బియ్యం తరలిపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సివిల్ సప్లై అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం వల్లే రేషన్ మాఫియా పని మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ మాఫియాపై నిఘా ఉంచి వారి ఆటలు కట్టించాలని కోరుతున్నారు.



బెజవాడలో

# ఆకాశ హర్మ్యం

నగరంలో అత్యంత ఎత్తయిన జీప్లస్20 భవనం

- 'కేఎంవీ వివాన్'పై హెలీప్యాడ్ ప్రత్యేక ఆకర్షణ
- ఎమర్జెన్సీ మెడికల్, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా సదుపాయం
- సకల సౌకర్యాలతో సిద్ధమైన హైరైజ్ బిల్డింగ్



ఆంధ్రజ్యోతి-విజయవాడ: విజయవాడలో ఆకాశాన్ని అందుకునేలా కనిపించే జీప్లస్20 అంతస్తులతో కూడిన భవనం సిద్ధమైంది. ఇది నగరంలోనే అత్యంత ఎత్తైన బిల్డింగ్. ఎనికేపాడు-తాడిగడప వంద అడుగుల రోడ్డు వెంబడి ఉండే ఈ హైరైజ్ భవనంపై హెలిప్యాడ్ నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మెట్రో నగరాలు, అభివృద్ధి చెందిన దేశాల్లో కనిపించే టవర్స్ మాదిరిగా ఈ కేఎంవీ వివాన్ బిల్డింగ్ రూపుదిద్దుకుంది. బెజవాడలో తొలి హెలిప్యాడ్ కలిగిన భవనం ఇదే! ఎలాంటి సామర్థ్యం కలిగిన హెలికాప్టర్ అయినా ఇక్కడ ల్యాండ్ కావచ్చు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో వెళ్లే ప్రయాణికులకు ఈ ఆకాశ హర్మ్యం కనిపిస్తుంది. నగరంలో ఈ హైరైజ్ బిల్డింగ్ సంస్కృతికి 15 ఏళ్ల కిందట ఆటోనగర్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థల భవన్ మొదటగా శ్రీకారం చుట్టింది. జీప్లస్ 8 విధానంలో నిర్మించిన ఈ భవనం తర్వాత భవానీపురంలో ఒకటి, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో మరొకటి నిర్మించారు. ఈ రెండూ గ్రూప్ బిల్డింగ్స్‌తో జీప్లస్16, ఆ లోపు మాత్రమే ఉన్నాయి.

ఈ జీప్లస్20 భవనంపై ఉండే హెలీప్యాడ్ వైద్యం వంటి అత్యవసర సమయాల్లోనూ ఉపయోగపడుతుంది. వీఐపీలు హెలికాప్టర్ ద్వారా ఇక్కడ దిగి.. రోడ్డు మార్గం మీదుగా విజయవాడ నగరంలోని త్వరగా చేరుకోవచ్చు. ఈ భవనంలో 3, 4 బెడ్రూమ్‌లతో కూడిన ఫ్లాట్లు ఉన్నాయి. ఈ హైరైజ్ బిల్డింగ్‌ను చూడటానికి సందర్శకులను అనుమతిస్తున్నారు.

## బీమా రంగంలో ఎఫ్‌డీఐల పెంపు అవాంఛనీయం

- భోజన విరామంలో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో ఎఫ్‌డీఐల పెంపు అవాంఛనీయమని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) మచిలీపట్నం డివిజనల్ జాయింట్ సెక్రటరీ చిలకలపూడి కళాధర్ అన్నారు. బీమా రంగంలో ఫారిన్ డైరెక్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డిఐ)ని 74శాతం నుంచి 100శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐఐఈఏ పిలుపు మేరకు మంగళవారం బీసెంట్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బీమా ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించడం ప్రభుత్వ రంగ బీమా వ్యాపారాన్ని దెబ్బతీయడమేనన్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఇది గొడ్డలిపెట్టు చర్య అన్నారు. దీంతో ప్రభుత్వ విధానాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఏఐఐఈఏ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ చర్యకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తామన్నారు. బీమా పరిశ్రమను కార్పొరేట్ లాభాల కోసం కాకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేయాలన్నాన్నానాన్నారు. యూనియన్ నేతలు ఎస్ఎంకే ప్రసాద్, ఈవీ తులసీరావు, ఎస్. శ్రీనివాస్, సీహెచ్ రాజశేఖర్, కె. కృష్ణప్రసాద్, వీకే సాయిప్రసాద్, గుర్రం శ్రీనివాస్, ఏపీ గోవర్ధన్ పాల్గొన్నారు.





బీసెంట్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు





అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసు

## క్యాన్సర్‌పై సంయుక్త పోరాటం

రైల్వే ఆసుపత్రి చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను జయించేందుకు కొత్త తరహాలో కలిసికట్టుగా పోరా టం (ఫైట్ బై యూనిక్) చేయాలని విజయవాడ రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ జే శ్రీనివాసు అన్నారు, క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం రైల్వే ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారి ఎంతగా వేధిస్తోంది. పర్యవసాలు, పరిణామ క్రమంలో జరిగే అనర్థాల గురించి వివరించారు. అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జైదీప్, అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ డాక్టర్ కోట రాజేష్, పరిపాలనా విభాగం అదనపు చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ రవికాంత్‌క్యాన్సర్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సోదాహరణంగా వివరించారు.

### వివిధ రూపాల్లో వేధించే క్యాన్సర్



క్యాన్సర్ వివిధ రూపాల్లో వేధిస్తుందని అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ వైద్యురాలు అనిల అన్నారు పొట్టి శ్రీరాములు, చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో క్యాన్సర్ డే సందర్భంగా బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 40ఏళ్లు దాటిన ప్రతి మహిళ శారీరక ఇబ్బందులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరచూ పరీక్షలు చేయించుకుని ముందస్తుగా చికిత్సలు చేయించుకోవాలన్నారు. మంచి ఆహారం, మంచి అలవాట్లతో ఎలాంటి రుగ్మతలనయినా జయించవచ్చునన్నారు. మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో మూలనపడిన ఎక్స్‌రే మిషన్

ప్రభుత్వాసుపత్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వాసుత్రి సీ బ్లాక్‌లో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ 15 రోజులుగా మూలనపడింది. దీంతో రోగులకు ఎక్స్‌రే తీయించుకునేందుకు సూపర్ బ్లాక్‌లోని ఎక్స్‌రే కేంద్రం వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు చోట్ల పని చేస్తేనే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. అలాంటిది ఇప్పుడు ఎక్స్‌రే తీయించుకునేందుకే ఒక పూట పోతుందని రోగులు వాపోతున్నారు. పని చేయని ఎక్స్‌రే ఉన్న రూమ్‌కు అధికారులు తాళాలు వేసి దాని ముందు కూర్చునేందుకు కుర్చీలు వేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఎక్స్‌రే మిషన్ మరమ్మతులు చేయించే ఆలోచన చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణం ఎక్స్‌రే మిషన్‌కు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.



ఎక్స్‌రే కోసం క్యూ లైన్‌లో నిల్చున్న రోగులు

### మిషన్ పాడైంది
### ఏవీ రావు, సూపరింటెండెంట్

ఎక్స్‌రే మిషన్ బోర్డు పోయింది. ఆర్డర్ పెట్టాం. మరో 4 రోజులకు వస్తుంది. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

## నందివాడ వద్ద కోడివ్యర్థాల లారీలు పట్టివేత



కోడి వ్యర్థాల లారీని పట్టుకున్న ఎస్ఐ శ్రీనివాస్

నందివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెదపాడు నుంచి కుదరవల్లి మీదుగా నందివాడ మండలంలోకి వస్తున్న ఐషర్ లారీలను ఎస్ఐ కె.శ్రీనివాస్ తన సిబ్బందితో సోమవారం సాయంత్రం పట్టుకున్నట్టు తెలిపారు. కొంతకాలంగా మండలంలోని పంకాస్ చేపల చెరువుల యజమానులు పంకాస్‌కు మేతగా కోడి పేగులు పాడైపోయిన అన్నం, వ్యర్థ పదార్థాలు మేతగా ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. తహసీల్దార్, వీఆర్వో కృపానిధి ఆధ్వర్యంలో ఈ వ్యర్థాలను భూస్థాపితం చేసినట్టు తెలిపారు. తహసీల్దార్ గురుమూర్తి మాట్లాడుతూ మండలంలో పంకాస్ చెరువుల యజమానులు ఎంత మంది ఉన్నది, వారు పంకాస్ చెరువులకు ఏప మేతలు వేస్తున్నది పరిశీలించి కోడి వ్యర్థాలు వేస్తుంటే చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాస్ లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై వదిలిపెట్టారు.

## టీటీడీలో ఘనంగా రథసప్తమి వేడుకలు

- తొలిసారి మాఢవీధుల్లో ఊరేగిన స్వామివారు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలిసారిగా టీటీడీ కల్యాణమండపం మాఢవీధుల్లో స్వామివారిని తిరుచ్చిపై భక్తులు ఊరేగించారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన వేడుకలు, తదుపరి తోమాల సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ వర్ణాల పుష్పాలతో అద్భుతంగా అలంకరించారు. 7.05 నిమిషాలకు స్వామివారిపై సూర్యకిరణాలు ప్రసరించిన సమయంలో పండితులు వేదమంత్రాలు ఘోష చేయగా భక్తులు ఆదిహృదయం పఠించారు. అనంతరం ముస్తాబైన స్వామి వారి ఉత్సవ మూర్తిని 'తిరుచ్చి'పై ఆసనంగా ఉంచి మాఢవీధుల్లో ఊరేగించారు. విశేష అలంకార ప్రియునకు మూల, మూలల మహిళలు హారతులిచ్చి తమ భక్తిని చాటారు. దాదాపు 400 మంది భక్తులు బృందంగా హారతులిచ్చిన రీతి కనులవిందు చేసింది. అర్చకులతో పాటు ముఖ్య అధికారులు, సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు, లలిత రమాదేవితో పాటు స్వామికి పూలతో విశేష అలంకారం చేసిన దాతలు పడవల ఏడుకొండలు-శాంతిశ్రీ దంపతులు, విజయకుమార్-సునీత దంపతులు, ప్రసాదరెడ్డి, సుబ్రహ్మణ్యం దంపతులు, తులసి, రాజేశ్వరి, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణలతో ఆద్యంతం టీటీడీ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది.



తిరుచ్చిపై మాఢ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు



వివాహ పత్రిక, జ్ఞాపికను సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న బోడె ప్రసాద్, కుటుంబసభ్యులు

## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు బోడె ఆహ్వానం

- కుమారుడి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసిన ఎమ్మెల్యే

పెనమలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న తన కుమారుడు బోడె వెంకట్రామ్ వివాహానికి సంబంధించిన వివాహ ఆహ్వాన పత్రికను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో బోడె ప్రసాద్ అందజేశారు. తన కుమారుడి వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కోరారు. బోడె ప్రసాద్ వెంట ఆయన సతీమణి బోడె హేమచౌదరి, కుమార్తె వైష్ణవి ఉన్నారు.

## నగరంలో 'అమ్మ' రాజశేఖర్ సందడి

లబ్బీపేట, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకుడు అమ్మ రాజశేఖర్ నగరంలో సందడి చేశారు. ఈనెల 14న విడుదలవుతున్న 'తల' చిత్రం ప్రమోషన్‌ను నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రేమికుల దినోత్సవం రోజున ఈ చిత్రాన్ని తెలుగు, తమిళంలో విడుదల చేస్తున్నామని తన కుమారుడు రాగిన్ రాజ్‌ను హీరోగా పరిచయం చేస్తూ నిర్మించామని, ఈ చిత్రం ద్వారా అమ్మ రాజశేఖర్ కచ్చితంగా కమ్‌బ్యాక్ ఇస్తారన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ సంగీత దర్శకుడిగా పనిచేశారని, ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. హీరో రాగిన్ రాజ్, హీరోయిన్ నోరా ఎస్తేర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత రాధ రాజశేఖర్ పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
| --- | --- |
| బ్రాయిలర్‌బర్డ్ | 125, 134, 145 |
| చికెన్ విత్ స్కిన్ | 240 |
| చికెన్ స్కిన్‌లెస్ | 250 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

## ఎన్‌డీఏ ప్రభుత్వంలో రాష్ట్రానికి బడ్జెట్‌లో పెద్దపీట : యర్రపోతు

గుడివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా నష్టపోయిందని, నేడు ఎన్‌డీఏ కూటమిలోని టీడీపీ, జనసేన అధినేతల కృషి వలన కేంద్రంలో బీజేపీ రాష్ట్రానికి భారీ ఎత్తున నిధులను కేటాయించిందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు యర్రపోతు అర్జున్ అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల కృషితో రాష్ట్రానికి మరిన్ని నిధులు రావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో పట్టణ వన్‌టౌన్ అధ్యక్షుడు కె.కె.డి ప్రసాద్, నందివాడ మండలాధ్యక్షుడు వాసుపల్లి రాంప్రసాద్, నాయకులు మామిడాల వెంకట రమణకుమార్, కొత్త కిరణ్‌కుమార్, అలజంగి ప్రభాకరరావు, గంజి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం

గుడివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానికులు పొలగాని గణపతిరావు, శ్రీలక్ష్మీ దంపతుల పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పట్టణంలోని పేదలకు బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) స్థానిక ఆఫీసర్స్ క్లబ్ వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలగాని కుటుంబసభ్యులు, ఆదరణ సేవాసంస్థ అధ్యక్షులు బోనం గోపిక, లంకా రాంబాబు, ఆర్‌కె వారియర్స్ పాల్గొన్నారు.

## మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 11న

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30కు జరుగుతుందని ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ గద్దె పుష్పరాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు.

## వృద్ధులకు దుస్తుల పంపిణీ

గుడివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మందపాడులోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో మంగళవారం కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ కొనకళ్ల సీతయ్య ఆయన తండ్రి సుబ్బారావు 36వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు చీరలు, పురుషులకు లుంగీలు, టవల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, పోకూరి మోహనరావు,బెజవాడ బాజేశ్వరరావు, తిరువీధి సుబ్బారావు, ఆంజనేయులు, చంద్రశేఖరరావు, ఉమాశంకర్, రంగబాబు, దేవేంద్రరావు పాల్గొన్నారు.

## బ్రదర్ పాల్‌ఎజ్రా విగ్రహావిష్కరణ

గుడివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలో కల్వరి సన్నిధి వ్యవస్థాపకుడు బ్రదర్ పాల్‌ఎజ్రా విగ్రహాన్ని దళిత సంఘాల నాయకులు పొంగులేటి జయరాజు, కంచర్ల సుధాకర్‌లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాది జాలాది విద్యాసాగర్, న్యాయమూర్తి ఎన్.ఎం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వెలుగు ఏపీఎం మృతి

పెదపారుపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న నత్త సాంబమూర్తి అనారోగ్యం కారణంగా మంగళవారం తుది శ్వాస విడిచారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామమైన పెదమద్దాలిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, బుక్ కీపర్లు, అకౌంటెంట్, సీసీలు ఆయనకు ఘన నివాళులర్పించి ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

## జిల్లాస్థాయి అబాకస్‌లో త్రివేణి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న త్రివేణి పాఠశాల డైరెక్టర్ శివశంకర్

గుడివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వివేకానంద కాన్సెప్ట్ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి వేదిక్ మ్యాథమేటిక్స్ అబాకస్ పోటీ పరీక్షల్లో స్థానిక త్రివేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ బహుమతులను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో బహుమతులను సాధించిన విద్యార్థులను డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




లింగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏవో అనంతలక్ష్మి

## లింగవరంలో 'పొలం పిలుస్తోంది'

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు మినుము పంట పూత, బిందె దశలో ఉన్నందున రక్షించుకోవటానికి రసాయనిక ఎరువులు తక్కువ మోతాదులో చల్లుకోవాలని ఏవో అనంతలక్ష్మి తెలిపారు. మంగళవారం లింగవరం, మల్లాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మినుము పంట లేత దశలో ఉన్నప్పటి నుంచే వేపనూనె పిచికారి చేసుకోవాలని రైతులకు వివరించారు. అవసరానికి మించిన మందులు వాడరాదని తెలిపారు. మంచు ఎక్కువగా ఉన్నందున బూడిద తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. .ఈ కార్యక్రమంలో ఏఈవో అనిత, లింగవరం, మల్లాయపాలెం గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి



సైక్లిస్టు ఐనంపూడి చంద్రశేఖర్

గుడివాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక మార్కెట్ సెంటర్‌లో మలుపు వద్ద టిప్పర్ ఢీకొనడంతో సైక్లిస్టు ఐనంపూడి చంద్రశేఖర్(78) అనే వృద్ధుడు మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## అబాకస్ పోటీల్లో ఏఏఎన్‌ఎం విద్యార్థుల విజయం



అబాకస్ పోటీల విజేతలతో హైస్కూల్ సిబ్బంది

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అబాకస్ పోటీల్లో స్థానిక ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆన్ఎస్‌ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు విజయం సాధించారని హైస్కూల్ ప్రిన్సిపాల్ లీనా సాతులూరి తెలిపారు. తమ విద్యార్థులు జి.యశ్విక జూనియర్ లెవల్ -3 లో బెస్ట్ పెర్ఫార్మర్‌గా నిలిచిందన్నారు. ఈ విద్యార్థిని ఈ నెల 9న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ఆమె తెలిపారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు జరీనా,విజయ్ బాబు, లక్ష్మీ సాయి కుమారి, లలిత, వహీదున్నీసాలను యాజమాన్యం, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం.సత్యబాబులు అభినందించారు.





తమ్మలంపాడు వద్ద దోసపాడు చానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, పెదపారుపూడి మండలంలో..

# నీరు పారేదెట్టా..?

దోసపాడు చానల్‌లో కిలోమీటర్ల మేర పేరుకుపోయిన గుర్రపుడెక్క

(పెదపారుపూడి, ఆంధ్రజ్యోతి)
దోసపాడు చానల్‌లో నీరు పారే పరిస్థితులు లేవు. కాలువ నిండా కిలోమీటర్ల మేర గుర్రపు డెక్క పేరుకుపోయి నీటి పారుదలకు అడ్డంకిగా మారింది.

పెదపారుపూడి, నందివాడ మండలాల్లోని పంచాయతీ చెరువులను నింపుకునేందుకు, మినుము ఆయకట్టుకు నీటి అవసరాలను తీర్చేందుకు ఇరిగేషన్ అధికారులు దోసపాడు చానల్‌కు నీటిని విడుదల చేశారు. మండల వ్యాప్తంగా కాలువలో గుర్రపుడెక్క కిలోమీటర్ల మేర పేరుకుపోయింది. కనుచూపు మేర ఎటు చూసిన గుర్రపు డెక్కే దర్శనమిస్తుంది. నీరు సాఫీగా వెళ్లే మార్గం లేకపోవడంతో దిగువ పొలాలకు, చెరువులకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

# సూర్యభగవానుడి దీవెనలు ప్రజలపై ఉండాలి

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సూర్యభగవానుడి దీవెనలతో ప్రజలందరూ సుఖశాంతులతో, సౌభాగ్యంతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక శ్రీభీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఎన్‌ఆర్‌ఐ జగన్ యెలిశెట్టి ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా నిర్వహించిన చండీ హోమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. తొలుత స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల, రావిలు హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, తహశీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, వేదపండితులు, కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**ఐదేళ్లలో గుడివాడను**
**మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా**

గుడివాడ: రాబోవు ఐదేళ్లలో మోడల్ నియోజకవర్గంగా గుడివాడను తీర్చిదిద్దుతానని, అభివృద్ధి పథంలో తీసుకువెళ్ళేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామి యిచ్చారు. మంగళవారం స్థానిక విజయవాడ రోడ్డులోని సాయినగర్ కాలనీలో ఉదయం పర్యటనలో భాగంగా పర్యటించారు. వచ్చే జూలై లోపు కాలనీలో సమస్యలను, ప్రధాన రహదారి నిర్మాణ సమస్యను పరిష్కారిస్తానని హామీ యిచ్చారు. అనంతరం చెంచుపేట, రైలుపేటల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల పర్యటించారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు పైడిముక్కల వంశీ, నీరుడు సురేష్, అమీర్ భాషా, మీరావలి, నాని తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి, యలవర్తి, బూరగడ్డ తదితరులు



శ్రీ మోటూరు దేవాలయంలో ..



పెదపారుపూడిలో..



పామర్రులో..

# అత్యంత వైభవంగా రథసప్తమి వేడుకలు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం శ్రీ మోటూరు దేవాలయంలో ఉన్న శ్రీ కోదండ రామ దేవాలయంలో రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ఈవో గోరిపర్తి నాగమౌనిక ఆధ్వర్యంలో వేదపండితుల మధ్య రథసప్తమి పండుగను ఘనంగా నిర్వహించారు. రథ సప్తమి సందర్భంగా పాత రథంను భక్తులు మరమ్మతులు చేయించి శ్రీ కోదండ రామస్వామికి అందజేశారు. ఆలయ ఈవో నాగమౌనిక భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలోని లింగవరం, చౌటపల్లి, మల్లయపాలెం తదితర గ్రామాల్లో ఘనంగా జరిగాయి. **పెదపారుపూడి:** పెదపారుపూడి గ్రామంలోని శ్రీ సీతారామ స్వామివారి దేవస్థానం శత వార్షికోత్సవం, రథ సప్తమి సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అర్చకులు శ్రీ లక్ష్మీ నరసింహాచార్యులు రథసప్తమి విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో గారపాటి వీర నాగబాబురావు, గారపాటి బాలకృష్ణ, కె.పూర్ణచంద్రరావు, భక్తులు పాల్గొన్నారు. **పామర్రు:** మండల పరిధిలో రథసప్తమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో సూర్య ఆరాధకులు జరుపుకున్నారు. సూర్యదేవుని ఆరాధనతో సకల రోగాలు నయం ఆవుతాయని ప్రతీతి.

# క్యాన్సర్‌పై అవగాహన అవసరం

డాక్టర్ కె.లక్ష్మీ ప్రియదర్శిని

గుడివాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చునని విజయవాడ, సిటీ క్యాన్సర్ సెంటర్ వైద్యులు కె.లక్ష్మీ ప్రియదర్శిని తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ డే పురస్కరించుకుని మంగళవారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో పర్వతనేని వెంకట అనసూయదేవి స్మారక ఉపన్యాస కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాణాంతక వ్యాధి గురించి అవగాహన కల్పించడం, ముందస్తుగా గుర్తించడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఉమెన్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ డి.విమలకుమారి, కార్యదర్శి ఎ.దుర్గాభవాని, అధ్యాపకులు, విద్యార్థులు, పర్వతనేని కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రియదర్శిని



మాట్లాడుతున్న డాక్టర్ పాలడుగు విశాలి

**శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో..**

గుడివాడ : స్థానిక శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో స్పెక్ట్రమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ అధినేత డాక్టర్ పాలడుగు విశాలీ విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, ఎలక్ట్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, క్లబ్ కౌన్సిలర్ డా.పి.విశ్వేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి జి.నరేష్, పూర్వ అధ్యక్షుడు ఎం.రమణమూర్తి, బి.శంకరరావు, ప్రిన్సిపాల్ డా.చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీలకు అండగా సీఎం చంద్రబాబు

● నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు వీరంకి పరశురామ్

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పది శాతం మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయించటమే కాకుండా 50శాతం లైసెన్స్ ఫీజు రాయితీ కల్పించటం సీఎం చంద్రబాబుకు బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పామర్రు నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు, కనకవల్లి ఉప సర్పంచ్ వీరంకి పరశురామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు గీతకార్మికుల కుటుంబాల బలోపేతానికి చర్యలు తీసుకుంటుంటే వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేయించటం దుర్మార్గమన్నారు.

గీతకార్మికులు చనిపోతే రూ 10 లక్షలు ఇస్తామని అధికారంలో ఉన్నప్పుడు జగన్ చెప్పి మాట తప్పారని, గత ఐదేళ్ల కాలంలో 50 మంది గీతకార్మికులు చనిపోతే ఒక్కరికి కూడా రూ. 10 లక్షల ప్యాకేజీ ఇవ్వలేదని పరశురామ్ తెలిపారు. అంతేకాకుండా 693 జీవో తీసుకు వచ్చి గీత కార్మికుల హక్కులను జగన్ కాలరాశారన్నారు. గీత కార్మికులు, బీసీ వర్గాలు సీఎం చంద్రబాబుకు ఎప్పుడు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

## తాగునీటి ఇబ్బందులు పరిష్కరించండి

● మండల పరిషత్ సమావేశంలో ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు



ప్రసంగిస్తున్న ఎంపీపీ కొండేటి ఇందిర

కూచిపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కోరారు. మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిరా అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కాజలో తాగునీటి సమస్య ఉందని, ఇటీవల నాలుగు రోజులు తాగునీరు రాకపోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఎంపీటీసీ సభ్యురాలు పేకేటి వెంకట లక్ష్మీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మొవ్వ, నిడుమోలు, కాజ, పాలంకిపాడు, చినముత్తేవి గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరాయని, వేసవి తీవ్రత దృష్ట్యా ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణంపై అధికారులు దృష్టిసారించాలని సభ్యులు కోరారు. మొవ్వ కాలనీలో రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉందని సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు అధికారులను కోరారు. కాజ గ్రామంలో ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన బెయిలీ బ్రిడ్జి నేడు శిథిలావస్థకు చేరిందని జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు సభలో ప్రస్తావించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ఇది ఎంతగానో దోహదపడుతుందని, ప్రజాప్రతినిధులు ఈ పథకం ఉపయోగాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని ఎంపీడీవో జె.విమాదేవి సభ్యులను కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆశాజనకంగా మినుము పైరు



కూచిపూడిలో ఏపుగా పెరిగిన మినప పైరు

కూచిపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీలో సాగవుతున్న మినుము పైరు ఆశాజనకంగా ఉంది. పైరు ఏపుగాపెరిగి పూత పిందె దశలో ఉంది. మండలంలో 11 వేల హెక్టార్లలో రైతులు మినుము సాగు చేశారు. పలు చోట్ల బంగారు తీగ, ఆకుమచ్చ, బూడిద తెగులు వ్యాపించినట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే రైతులు క్రిమిసంహారక మందులు అధికంగా వాడుతున్నారని, మినప పైరును తరచూ తడపటం వల్ల తేమశాతం అధికమై దిగుబడులు తగ్గే అవకాశముందని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. అధికంగా క్రిమిసంహారక మందులు వాడటం వల్ల అధిక వ్యయమవ్వటంతోపాటు దిగుబడులు కూడా తగ్గే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకనుగుణంగా పైరును ఆశించిన తెగుళ్లకు తగు మోతాదులో పిచికారి చేస్తే సరిపోతుందని వ్యవసాయశాఖాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం పైరుకు అనుకూలంగా ఉండటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉండే అవకాశాలున్నాయని, మినుము ధరలు కూడా అనుకూలంగా ఉంటే తమ కష్టాలు తీరతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రీ సర్వే సమర్థవంతంగా నిర్వహించండి : ఆర్డీవో

మోపిదేవి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి అన్నారు. మోపిదేవి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె రికార్డులు తనిఖీ చేశారు. రెండో విడతగా 124 ఎకరాలకు సంబంధించి వచ్చిన సమస్యలు పరిష్కారం నిమిత్తం రైతుల అభిప్రాయాలు తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన నీటి తీరువా శిస్తు వసూళ్లను సచివాలయాలకు అప్పగించటంతో వసూళ్లు మందకొడిగా ఉన్నమాట వాస్తవమేనని తెలిపారు. విషయాన్ని కలెక్టర్ తెలియజేసి నీటితీరువా శిస్తు వసూళ్లు వేగవంతమయ్యేలా చూస్తామన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
| --- | --- |
| బ్రాయిలర్ బర్డ్ | 125, 134, 145 |
| చికెన్ విత్ స్కిన్ | 240 |
| చికెన్ స్కిన్‌లెస్ | 250 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.480

## రీ సర్వే సమర్థవంతంగా నిర్వహించండి : ఆర్డీవో

మోపిదేవి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి అన్నారు. మోపిదేవి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె రికార్డులు తనిఖీ చేశారు. రెండో విడతగా 124 ఎకరాలకు సంబంధించి వచ్చిన సమస్యలు పరిష్కారం నిమిత్తం రైతుల అభిప్రాయాలు తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన నీటి తీరువా శిస్తు వసూళ్లను సచివాలయాలకు అప్పగించ టంతో వసూళ్లు మందకొడిగా ఉన్నమాట వాస్తవమేనని తెలిపారు. విషయాన్ని కలెక్టర్ తెలియజేసి నీటితీరువా శిస్తు వసూళ్లు వేగవంతమయ్యేలా చూస్తామన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

**అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** వేకనూరు ఉషా పద్మిని సమేత సూర్యనా రాయణ స్వామి దేవాలయం రథసప్తమిని పురస్కరించుకుని అంగరంగ వైభవంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి భక్తులు విచ్చేయటంతో సూర్య జయంతి మహోత్సవాలకు తెల్లవారుజామునుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చే శారు. స్వామివారికి విశేష అభిషేకాలు, నిజరూప దర్శనం చేశారు. ఆతర్వాత సహస్రనామ పూజలు నిర్వహించిన అనంతరం సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తకోటి ఆధ్వర్యంలో శ్రీ ఉషాపద్మిని సమేత శ్రీ స్వామివారి శాంతికల్యాణం వైభవంగా నిర్వహించారు. అనం తరం 12 వేల మంది భక్తులకు అన్నసమారాధ నిర్వహిం చారు. సీఐ యువరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించగా, ఆలయ వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు, ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

### కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో..

మచిలీపట్నం టౌన్ : రథసప్తమి సందర్భంగా కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని ఆవుపాలతో అభిషేకించారు. రథసప్తమి సందర్భంగా బచ్చుపేట వెంకటేశ్వరస్వామి దేవాలయం, రాబర్ట్సన్‌పేట రంగనాయకస్వామి, హయగ్రీవస్వామి, మూడుస్తంభాల సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు జరిపారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు

**అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పులిగడ్డ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం అర్థరాత్రి దొంగలు ప్రవేశించటంతో ఈ కార్యక్రమానికి ఆలయ అర్చకు లు అగ్నిహోత్రం ధన్వంతరాచారి ఆధ్వర్యంలో ప్రక్షాళన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని శుద్ధి చేయటంతోపాటు హోమాన్ని నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా భావనారుషి కల్యాణం

కోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో భద్రావతి సమేత భావనారుషి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ రెండవ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి అన్నప్రసాదం స్వీకరించారు.

## వ్యవసాయ కార్మికులకు నిధులు కేటాయించాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌లో కార్మికులు, కౌలు రైతులతో పాటు వ్యవసాయ కార్మికులకు నిధులు కేటాయించాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మచిలీపట్నం రేవతీ సెంటర్‌లో మంగళవారం జరిగిన ధర్నాలో ఏపీ కౌలు రైతుల సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, నాయకులు బి. సుబ్రహ్మణ్యం, గౌరిశెట్టి నాగేశ్వరరావు, వై. మధు, ఎస్. నారాయణ, మాదా వెంకటేశ్వరరావు, పి. ధనశ్రీ, కుమారి, వై. నరసింహారావు, సిహెచ్. జయరావు, కొడాలి శర్మ, కరీముల్లా, వాకా రామచంద్రరావు, కొండలబాబు, టి. చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలపాటి విజయానికి కృషి చేయాలి

• కూటమి నాయకులకు మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ పిలుపు



లలిత కన్వెన్షన్ హాలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి ఆలపాటి రాజా విజయానికి కూటమి నాయకులందరూ కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో, లలిత కన్వెన్షన్ హాలులో జరిగిన సమావేశాల్లో కొల్లు రవీంద్ర మాట్లాడారు. తెనాలి సీటును త్యాగం చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ సేవాదృక్పథం గల నాయకుడిగా ఎదిగారన్నారు. ఆలపాటి గెలుపే మన గెలుపుగా భావిస్తూ అందరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు.ఇన్‌చార్జి మంత్రి, కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ప్రతి 30 మంది ఓటర్లకు ఒక నాయకుడు వెళ్లి కలుస్తూ ఎన్నికల ప్రచారం చేయాలన్నారు. ఆలపాటి విజయం తథ్యమని, అయితే మెజారిటీపై దృష్టి సారించాల న్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ప్రణాళికా బద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలన్నారు. గతంలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు ఏ విధంగా నిర్విరామంగా ప్రచారం చేశామో అదే రీతిలో కూటమి అభ్యర్థులందరూ కలసి కట్టుగా ఒకే తాటిపై ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు తనకు పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చారని, తాను గెలిస్తే పూర్తి స్థాయిలో గ్రాడ్యుయేట్లకు సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో గుడివాడ, పెడన, పామర్రు, పెనమలూరు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, బోడె ప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్లు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కొనుగుంట్ల కోటేశ్వర రావు, గొట్టిముక్కల రఘు, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజాబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, కుంచే నాని, ఎండీ ఇలియాస్ పాషా, జనసేన నాయకులు గల్లా తిమోతి, గడ్డం రాజు పాల్గొన్నారు.

**మచిలీపట్నంలో ఎల్ఎంఎల్ వాహనాల తయారీ ప్లాంట్ నిర్మించండి - కొల్లు రవీంద్ర వినతి**

మచిలీపట్నంలో ఎల్ఎంఎల్ వాహనాల తయారీ ప్లాంట్ నిర్మించాలని ఎల్ఎంఎల్ వాహనాల తయారీ సంస్థ ఎండి, సీఈవో డాక్టర్ యోగేష్ బాటియాను మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. మంత్రిని యోగేష్ బాటియా మర్యాద పూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలో పోర్టు వస్తున్నందున విద్యుత్ వాహనాల తయారీకి అనుకూలంగా ఉంటుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రితో సమావేశమై ఒక ఒప్పందం కుదుర్చుకుందామన్నారు.

**బంటుమిల్లి :** కృష్ణా, గుంటూరు పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మంచి మెజారిటీ సాధించేలా బాధ్యతగా వ్యవహరించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రాద్ అన్నారు. మంగళవారం బంటుమిల్లిలో కూటమి నాయకులతో ఆత్మీయ సమావేశ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ, 30 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించి గెలుపుకోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


ఈడేపల్లిలో కలెక్టర్ బాలాజీకి సమస్యలను వివరిస్తున్న స్థానికులు

## తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి
### కలెక్టర్ బాలజీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 4 ( ఆంధ్రజ్యోతి ): స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర సాధనకు నగర పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కలెక్టర్ డీకేబాలాజీ అన్నారు. మంగళవారం కలెక్టర్ 45, 24 డివిజన్‌లలోని పాతరామన్నపేట, ఈడేపల్లిలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో కలసి పర్యటించారు. పాతరామన్నపేటలో తడి, పొడి చెత్త ఒకే డబ్బాలో ఉండటాన్ని చూసి మునిసిపల్ కార్మికులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నగరంలోని పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరిం చాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త వేయకూడదన్నారు. బందరు స్వచ్ఛనగరంగా ఉండేందుకు ప్రజలకు మునిసిపల్ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అధికారులతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, పివి ఫణికుమార్ పాల్గొన్నారు.



## కుట్టుశిక్షణా కేంద్రం ప్రారంభం

**చల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మహిళలు స్వయం ఉపాధి శిక్షణ పొందటం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావచ్చని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వేములపల్లి రోజా అన్నారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డ కమలా నెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణా కేంద్రాన్ని రోజా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సురేష్, సర్పంచ్ వల్లూరు ఉమా, వేములపల్లి విజయ, మల్లుపెద్ది రత్నకుమారి, హనుమానుల రాణికుమారి, శిక్షకురాలు నాగమణి, ప్రముఖులు కంఠంనేని రాజగోపాల్, శరత్‌బాబు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పాలడుగు రత్నబాబు, మల్లుపెద్ది బోసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో ఓఎన్‌జీసీ ముందుకు సాగాలి : ఆర్డీవో


ఓఎన్‌జీసీ అధికారులను నిలదీస్తున్న ప్రజలు

బంటుమిల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతో ఓఎన్‌జీసీ ముందుకు సాగాలని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి అన్నారు. మంగళవారం బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఓఎన్‌జీసీ అధికారులు నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆర్డీవో స్వాతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు, అభిప్రాయాలు వ్యక్త పరచారు. ఓఎన్‌జీసీ వల్ల బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో పలు రోడ్లు ధ్వంసం అయినప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్తమూరు, సాతులూరు, మల్లేశ్వరం, ముల్లపర్రు, గరిసిపూడి, తదితర గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చిన ప్రాండ్రాక గ్రామానికి చెందిన ప్రజలు మే 11వ తేదీ లోపు మాగ్రామ రోడ్లు బాగు చేయకపోతే ఓఎన్‌జీసీ వాహనాలు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఓఎన్‌జీసీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల పలు గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు, ఓఎన్‌జీసీ అధికారులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడలు ముఖ్యమే

## డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మి


పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మి

ఘంటసాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి (డీఎస్‌డీవో) ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. కృష్ణా జిల్లా ఘంట సాల మండలం గోగినేనిపాలెంలోని జడ్పీ హైస్కూల్‌లో 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ క్రీడలు, ఆటల పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ, క్రీడలు మానసిక వికాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సెంట్రల్ జోన్‌లో పాల్గొన్న క్రీడాకారులకు ఆమె అభినందనలు తెలిపారు. అనంతరం క్రీడా ప్లాగ్‌ను ఎగురవేసి పోటీలను, కోర్టులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు, ఎంఈవోలు ఎస్.శివశంకర్‌రావు, ఎండి.మోమిన్, సర్పంచ్ గుత్తికొండ రామారావు, అత్తులూరి గోపిచంద్, మాలెంపాలెం పిచ్చేశ్వరరావు, గుత్తికొండ సుభాష్ చంద్రబోస్, అన్నే రత్నాకర్‌రావు, పీడీ మారుతి, హెచ్ఎం అనుపల్లవి భువనేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ కుంపటి జీవన్ కుమార్, కొడాలి మణి, కోసూరు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### 84వ గ్రిగ్ మెమోరియల్ పోటీలు ప్రారంభం

84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ పోటీలు గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభమ య్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని జరిగిన సబ్ జూనియర్స్ విన్నర్స్ ఈ పోటీల్లో పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపుపై హామీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 4 ( ఆంధ్రజ్యోతి ) : మచిలీపట్నం ఈడేపల్లి ప్రధాన డ్రెయిన్ ఆక్రమణలపై ఎదురవుతున్న సమస్యలపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందన లభించింది. మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం ఫైర్ స్టేషన్ పక్కనఉన్న ఈడేపల్లి ప్రధాన డ్రెయిన్‌పై ఆక్రమణలను తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆక్రమణదారులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న 4వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్, అధికారులు ఆక్రమణదారులతో చర్చలు జరిపారు. నాలుగైదు రోజుల్లో ఆక్రమణలు తొలగిస్తామని అధికారులకు హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

## వాసవీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

**పెడన రూరల్:** నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీఎస్ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు పూజిత, ప్రియాంక, జాహ్నవిలు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు. రూ. 3.6 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థినులకు నియామక పత్రాలను అందించారు. విద్యార్థినులను కళాశాల కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరక్టర్ దోనపాటి బాబా, సిబ్బంది అభినందించారు.

## కోడూరులో బాలోత్సవాలు

**కోడూరు:** కోడూరు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈవో రామదాసు ఆధ్వర్యంలో బాలోత్సవాలు నిర్వహించారు. మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ఏకపాత్రాభినయం, సాంగ్స్, స్కిట్స్, సోలో డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రెస్ అంశాలపై మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మృతి

పెడన, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జయలక్ష్మీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్, దళిత నేత చుక్కా నరసింహారావు (65) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గతంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. పలువురు నాయకులు మంగళవారం తోటమూలలోని నరసింహారావు నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

ఘంటసాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి చెందిన సంఘటన శ్రీకాకుళంలో సోమవారం జరిగింది. శీలంవారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త యర్రబోయిన శివకాశేశ్వరరావు (63)సోమవారం శ్రీకాకుళం సెంటర్‌కు వచ్చి తిరిగి శీలం వారిపాలెం సైకిల్‌పై వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొనటంతో కిందపడిపోయాడు. స్థానికులు కూచిపూడిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మచిలీపట్నం-కోన రహదారిపై శారదానగర్ కాలనీవాసుల ధర్నా


శారదానగర్ కాలనీ వాసుల ధర్నాతో నిలిచిపోయిన ట్రాఫిక్

మచిలీపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-కోన రహదారిపై కృష్ణా యూనివర్సిటీ సమీపంలో శారదానగర్ కాలనీ వాసులు మంగళవారం ధర్నాకు దిగారు. అక్కడున్న సమాధుల స్థలంలో అధికారుల సూచనలకు విరుద్ధంగా ఒక కానిస్టేబుల్ తన తల్లికి సంబంధించిన సమాధి నిర్మించడంపై వివాదం తలెత్తింది. కానిస్టేబుల్ కాలనీవాసులపై పోలీసులకు మూడు సార్లు ఫిర్యాదు చేశాడు. గతంలో సమాధుల స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని రెవెన్యూ, పోలీస్ అధికారులు చెప్పారు. అయినా కానిస్టేబుల్ సమాధి నిర్మాణ పనులను సోమవారం ప్రారం భించడంతో కాలనీవాసులు నిలదీశారు. దీంతో కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమపై మూడోసారి ఫిర్యాదు చేశాడని కాలనీ వాసులు సమాధులకు సమీపంలో కోనరోడ్డుపై బైఠాయించారు. దీంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీ ల్దార్ పి.మధుసూదనరావు, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నాగరాజు సర్ది చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం వద్దకు శారదానగర్ కాలనీ వాసులను, కానిస్టేబుల్‌ను పిలిచి స్థలాభావం కారణంగా అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేయవద్దన్నారు.

## అనుమానాస్పద మృతిపై కేసు

కృత్తివెన్ను, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పద మృతిపై మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. కృత్తివెన్ను ఎస్సై పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిదిబ్బ పల్లెపాలెం గ్రామానికి చెందిన వాటాల నాగేంద్రబాబు మంగళవారం ఉదయం స్నేహితుడు అండ్రాజు సాయితో కలిసి పీతల వేట కోసం పర్రలోని మడ అడవిలోకి బోటుపై వెళ్లాడు. కాగ కొంత సేపటి తరువాత సాయి మృతుడు నాగేంద్రబాబు అన్నయ్యకు ఫోన్ చేసి, పర్రలో నాగేంద్రబాబును దించి పీతల వేట కోసం ముందుకు వెళ్లి, గంట తరువాత తిరిగి రాగ, బురదలో నాగేంద్రబాబు చిక్కుకొని, చనిపోయి ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పైడిబాబు తెలిపారు.

## సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

నాగాయలంక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి వేమవరపు సీతారామయ్య మంగళవారం నాగాయలంక పంచాయతీలోచెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం నుంచి ఏయే ఉత్పత్తులను తయారు చేస్తున్నారో కార్యదర్శి జె.పవన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 15లోపు మండలంలోని అన్ని పంచాయతీల్లో సంపద కేంద్రాల షెడ్లను వినియోగంలోకి తీసుకుని రావాలని ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మను ఆదేశించారు.

## కేన్సర్‌ను సులభంగా నివారించొచ్చు
### మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఆశాలత

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌ను సులభంగా నివారించేందుకు మార్గాలు ఉన్నాయని మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఆశాలత అన్నారు. అంతర్జాతీయ కేన్సర్ దినో త్సవం సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. పింగళి వెంకయ్య ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. కోనేరు సెంటర్ నుంచి రాజాసెంటర్, రేవతీసెంటర్, రామానా యుడుపేట సెంటర్ మీదుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ర్యాలీ చేరింది. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసు పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## పులిగడ్డలో ఉపాధి పనులు ప్రారంభం

**అవనిగడ్డ రూరల్:** పులిగడ్డలో ఉపాధి హామీ పనులను మంగళవారం సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో డొంకలను, రహదారులను ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు పిచ్చేశ్వరరావు, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.